PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 315 | విజయవాడ, శుక్రవారం 16 జూన్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 16 June 2023 | Rs

'చించినాడ' దళితులకు న్యాయం చేయాలి

- ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు లేఖ

2

హైబ్రిడ్ మోడల్‌లో ఆసియాకప్

- ఆగస్టు 31నుంచి సెప్టెంబర్ 17వరకు టోర్నీ
- పాకిస్తాన్‌లో నాలుగు, శ్రీలంకలో తొమ్మిది వన్డేలు

లోపలి పేజీలో..

క్రీడలు, యువజన సర్వీసులకు సంబంధించి సమీక్షిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

'ఆడుదాం ఆంధ్రా' పేరుతో క్రీడా సంబరాలు

- సిఎం జగన్‌మోహన్‌రెడ్డి
- భవిష్యత్‌లో ఐపిఎల్‌కు ఎపి టీం
- ప్రతి నియోజకవర్గానికి ఇండోర్ స్టేడియం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆడుదాం ఆంధ్రా పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా సంబరాలు నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. క్రీడలు, యువజన సర్వీసుల శాఖపై తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సిఎం గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని స్థాయిల్లోనూ క్రికెట్ బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడు కిలోమీటర్ల మారథాన్, యోగా, టెన్నికాయిట్, సంప్రదాయ ఆటల పోటీలూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 46 రోజులపాటు ఈ పోటీలు జరుగుతాయని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీ గ్రౌండ్లు, మున్సిపల్ స్టేడియాలు, జిల్లా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, యూనివర్శిటీ గ్రౌండ్లలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఏటా ఈ పోటీలు జరగాలని సూచించారు. క్రికెట్‌కు సిఎస్‌కె మార్గదర్శకం చేస్తుందని, నిర్వహణలోనూ పాల్గొంటుందని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ముంబయి ఇండియన్స్ లాంటి జట్ల సహాయం కూడా తీసుకుంటామన్నారు. ప్రస్తుతం చెన్నై సూపర్‌కింగ్స్‌కు మూడు క్రికెట్ స్టేడియాల్లో శిక్షణ కార్యక్రమాలు అప్పగిస్తామని తెలిపారు. భవిష్యత్‌లో ఎపి నుండి ఐపిఎల్‌కు ఒక టీము వెళ్లే దిశగా ముందుకు సాగాలని, దీనివల్ల ప్రొఫెషనలిజం పెరుగుతుందని పేర్కొన్నారు. అంబటి రాయుడు, కెఎస్ భరత్ లాంటి వాళ్లు రాష్ట్రంలో యువకులకు స్ఫూర్తని అన్నారు. మొదట జిల్లాస్థాయిలోతరువాత రాష్ట్రస్థాయిలో ప్రొఫెషనల్‌గా క్రికెట్ ఆడించే పరిస్థితి ఉండాలన్నారు. ప్రతి మండలంలోనూ క్రీడా మైదానాలు ఏర్పాటు చేసుకోవాలని, గ్రామస్థాయిలో ఆడేవారికీ సామాగ్రి అందించాలని తెలిపారు. గెలుపొందిన వారిని కిట్లను అందించాలని, భవిష్యత్‌లో సచివాలయాలకు క్రీడాకిట్లను అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. హైస్కూలు ఆపైస్థాయిలో తప్పనిసరిగా క్రీడా సామాగ్రిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సిఎస్ జవహర్‌రెడ్డి, ఐటిశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, క్రీడలు, యువజన సర్వీసులశాఖ కార్యదర్శి వాణీమోహన్, శాప్ ఛైర్మన్ సిద్ధార్థరెడ్డి, ఆర్థికశాఖ కార్యదర్శి గుల్జార్, శాప్ ఎమ్‌డి హర్షవర్ధన్ పాల్గొన్నారు.

ఎపి పిజిఇ సెట్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి- ఎస్‌వియు క్యాంపస్

ఆంధ్రప్రదేశ్‌లో 2023 విద్యాసంవత్సరంలో ఇంజనీరింగ్, ఫార్మసీ పిజి కోర్సుల్లో చేరడానికి నిర్వహించిన ఎపిపిజిఇ సెట్-2023 ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. అమరావతి నుండి ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి ఆన్‌లైన్లో పాల్గొనగా, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డి గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఈ ఫలితాలను విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం ఇంజనీరింగ్ పిజి సెట్ నిర్వహించడం ఇది మూడవసారి. త్వరలో ఇంజనీరింగ్ పిజి అడ్మిషన్ల ప్రక్రియ మొదలవు తుందని హేమచంద్రారెడ్డి తెలిపారు. ఆచార్య కె.రాజారెడ్డి మాట్లాడుతూ మే నెల 28, 29, 30 తేదీలలో నిర్వహించిన ఈ పరీక్షకు 5970 మంది హాజరయ్యారని, వారిలో 5177 (86.72 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని వెల్లడించారు. కంప్యూటర్ సైన్స్, సివిల్, ఎలక్ట్రికల్, కమ్యూనికేషన్, మెకానికల్, కెమికల్, జియో ఇన్ఫరమేటిక్స్, ఇన్స్టుమెంటేషన్, మెటలర్జీ, నానో టెక్నాలజీ, ఫార్మసీ, బయో టెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో పిజి చేరాలనుకునే వారికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 15 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించామని తెలిపారు.

ఎపి ఐసెట్ ఫలితాలు విడుదల

అనంతపురం ప్రతినిధి : ఎపి ఐసెట్ 2023 ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, ఉన్నత విద్యామండలి సంయుక్తంగా మే 24న ఈ పరీక్ష నిర్వహించాయి. 44,943 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, వారిలో 41,799 (94.26 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. వీరు ఎంబిఎ, కంప్యూటర్ సైన్సు కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. వర్చువల్ విధానంలో ఫలితాల విడుదలలో ఉన్నత విద్యా మిగతా 7లో

గుజరాత్‌లో కచ్ వద్ద తీరాన్ని

తాకిన తుపాను

- అర్ధరాత్రి ఒంటి గంట వరకు ఒకటే అలజడి • నేటి మధ్యాహ్నానికి బలహీన పడే అవకాశం
- వణికిన కచ్, సౌరాష్ట్ర • ముగ్గురు మృతి, కూలిన చెట్లు, వెయ్యికిపైగా విద్యుత్ స్తంభాలు
- గంటకు 130 -145 కి.మీ వేగంతో గాలులు, భారీ వర్షాలు
- ఆరు మీటర్ల ఎత్తున ఎగసిపడుతున్న అలలు

కచ్ : బిపర్జోయ్ పెను తుపాను గుజరాత్‌లో పలు జిల్లాలను అతలాకుతలం చేసింది. కచ్‌వద్ద తీరం దాటడం మొదలైన తరువాత దాని ప్రభావం చాలా జిల్లాలపై పండింది. తుపాను ధాటికి ఎక్కడికక్కడ చెట్లు, వెయ్యికిపైగా విద్యుత్ స్తంభాలు, మొబైల్ టవర్లు కూలిపోయాయి. ఇంటి పైకప్పులు ఎగిరిపోయాయి. గంటకు 130 నుంచి 145 కి.మీ వేగంతో బలమైన ఈదురుగాలులు, కుంభ వృష్టిగా కురుస్తున్న వర్షాలతో కచ్, పోరు బందరు, మోర్బీ, రాజ్‌కోట్, భావనగర్ జిల్లాలు చిగురుటాకులా వణికిపోయాయి. వర్షాలు, గాలుల దెబ్బకు కచ్, భావనగర్ జిల్లాల్లో ముగ్గురు చనిపోయారు. పలు పశువులు మృత్యువాత పడ్డాయి.

ప్రాణ నష్టం, ఆస్తి నష్టం గురించి పూర్తి సమాచారం అందితే గానీ ఒక అంచనాకు రాలేమని అధికారులు చెబుతున్నారు. తుపాను తీరం దాటే ప్రక్రియ పూర్తి కావడానికి చాలా సమయం తీసుకుంది. అర్ధరాత్రి దాటాక తీరం దాటిన ఈ తుపాను శుక్రవారం మధ్యాహ్నానికి బలహీనపడుతుందని వాతావరణ కేంద్ర నిపుణులు చెబుతున్నారు. తుపాను తీరాన్ని దాటే ప్రాంతంలో పది కిలోమీటర్ల పరిధిలోని దాదాపు 20గ్రామాల నుండి లక్ష మంది వరకు ప్రజలను ఇప్పటికే తాత్కాలిక పునరావాస కేంద్రాలకు తరలించారు. భుజ్, ద్వారక, పోర్‌బందర్, జామ్‌నగర్ తీర ప్రాంతాల్లో మూడు నుండి ఆరు మీటర్ల ఎత్తున అలలు ఎగిసిపడుతున్నాయి. చాలాచోట్ల పల్లపు ప్రాంతాల్లోకి సముద్రపు నీరు చొచ్చుకువచ్చింది. ద్వారక, మండ్వి, మోర్బి జిల్లాలో బలమైన గాలులతోపాటు భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముంబయి తీరంలో సముద్రం అల్లకల్లోలంగా వుంది. పెద్ద ఎత్తున అలలు ఎగిసిపడుతున్నాయి. ఈ ముప్పును సమర్థవంతంగా ఎదుర్కొనడానికి గుజరాత్ ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. కచ్, సౌరాష్ట్రల్లోని ఆరు జిల్లాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు. తీర ప్రాంత జిల్లాల్లో ఇప్పటికే ఎన్‌డిఆర్‌ఎఫ్‌కి చెందిన 18 బృందాలు, 12 రాష్ట్ర విపత్తు సహాయక బృందాలు మోహరించాయి. భుజ్, జామ్‌నగర్, గాంధీనగర్‌ల వ్యాప్తంగా 27 రిలీఫ్ సైనిక దళాలను మోహరించినట్లు ఆర్మీ ప్రకటించింది.

కచ్‌లో జఖో వద్ద బిపర్‌జోయ్ ఉగ్రరూపం

విద్యార్థులకు పారితోషికం అందజేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ఇంజినీరింగ్ కళాశాలలతో స్కూళ్ల అనుసంధానం

- మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-చీపురుపల్లి

ప్రభుత్వ స్కూళ్లను ఇంజనీరింగ్ కళాశాలలతో అనుసంధానిస్తున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. ఒక్కో ఇంజనీరింగ్ కళాశాలతో పది నుంచి 15 పాఠశాలలను అనుసంధానం చేస్తామని తెలిపారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం నియోజకవర్గ స్థాయిలో ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్ టాపర్లకు నగదు పురస్కారాలు అందించే జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలల్లోని విద్యార్థులు పాఠశాల విద్యార్థులకు డిజిటల్ బోధనలో సహకరించ డంతో పాటు చివరి సంవత్సరం విద్యార్థులు తమ స్టడీ టూర్‌ను ఆయా పాఠశాలల్లో చేసే విధంగా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచే లక్ష్యంతో ప్రతి మండలానికి రెండో మండల విద్యాధికారిని నియమిస్తున్నామని తెలిపారు. విద్యా కానుక కిట్ల పంపిణీపై మంత్రి ఆరా తీశారు. రెండు రోజుల్లోగా కిట్ల పంపిణీని పూర్తిచేయాలని ఆదేశించారు. కిట్‌లోని అన్ని వస్తువులను ఒకేసారి ఇస్తేనే స్వీకరిం చాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకే జగనన్న ఆణిము త్యాలు పేరుతో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యా ర్థులకు నగదు పారితోషకాలు అందించే కార్య క్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. అనంతరం గరివిడి మండలం కోడూరు వద్ద రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యాలయ భవనాన్ని మంత్రి ప్రారంభిం చారు. రూ.16 లక్షలతో నిర్మించనున్న డిజిటల్ లైబ్రరీకి శంకుస్థాపన చేశారు.

తుమ్మలపల్లి ప్రసాద్‌కు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు

పల్లి సుబ్బరాజు, దుర్గా ప్రసాద్‌లకు అభినందనలు

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

సుదీర్ఘకాలం ప్రజాశక్తి సంపాదక బాధ్యతలు నిర్వహించిన మోటూరు హనుమంతరావు స్మారకార్థం ప్రతి ఏటా ప్రకటిస్తున్న ఉత్తమ జర్నలిస్టు అవార్డును ఈ ఏడాది నవభూమి జర్నలిస్టు తుమ్మలపల్లి ప్రసాద్‌కు ఇవ్వాలని అవార్డు కమిటీ నిర్ణయించింది.

హైదరాబాద్ నుండి వెలువడే నవభూమి పత్రికలో 2023 మార్చి8న 'మగువా నీకు వందనం!' అన్న శీర్షికతో ప్రచురితమైన ఈ వార్తా కథనాన్ని ఆ పత్రిక బ్యూరో చీఫ్ తుమ్మలపల్లి ప్రసాద్ రాశారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం మాదారం గ్రామానికి చెందిన 85 ఏళ్ల కప్పెర అనసూర్య తీవ్ర అనారోగ్యంతో ఉన్న తన కోడలికి సేవలందిస్తున్న వైనాన్ని మానవీయ కోణంలో కథనం చేయడం ప్రశంసనీయమని కమిటీ అభిప్రాయపడింది. అలాగే ప్రజాశక్తి మండపేట విలేకరి పల్లి సుబ్బరాజు 'ఆఖరి మజిలీలోనూ తప్పని వివక్ష!' పేర దళితుల అవస్థపైన, ఈనాడు ప్రత్యేక ప్రతినిధి దుర్గా ప్రసాద్ 'ఊరు వలసపోతోంది' అన్న శీర్షికతో కర్నూలు, అనంతపురం జిల్లాలపైన రాసిన వార్తా కథనాలను ప్రత్యేకంగా అభినందించాలని కమిటీ సూచించింది.

తుమ్మలపల్లి ప్రసాద్

ప్రజాశక్తి సాహితీసంస్థ 2002 నుంచి మోటూరు స్మారక అవార్డును క్రమం తప్పకుండా (కరోనా రెండేళ్లు మినహా) అందజేస్తున్నది. సీనియర్ సంపాదకులు మిగతా 5లో

బి.శ్రీనివాసాచారి, పి.రవికుమార్, ఎన్ షబ్బీర్‌లకు వి. ఆర్. బొమ్మారెడ్డి స్మారక ఉత్తమ జర్నలిస్టు పురస్కారాలు

- ఎన్.పవన్ కుమార్‌కు అభినందనలు

2

మత మార్పిడి నిరోధక చట్టం రద్దు

- కర్ణాటక క్యాబినెట్ నిర్ణయం

బెంగళూరు : కర్ణాటకలో గత బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద మత మార్పిడి నిరోధక చట్టాన్ని రద్దు చేయాలని ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కర్ణాటక మత స్వేచ్ఛ హక్కు రక్షణ బిల్లు 2022 (మత మార్పిడి నిరోధక బిల్లుగా విమర్శల పాలైంది)ను బసవరాజ్ బొమ్మై నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 2022 సెప్టెంబరులో అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నా అప్పటి హోం మంత్రి ఆరగ జ్ఞానేంద్ర ఈ బిల్లును ప్రవేశపెట్టారు. తప్పుడు మార్గాలు, మిగతా 5లో

సజ్జల పదవీకాలం పొడిగింపు

మరో ముగ్గురికి పొడిగింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సజ్జల రామకృష్ణారెడ్డిసహా నలుగురు ప్రభుత్వ సలహాదారుల పదవీకాలాన్ని పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించే ప్రజా వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు సజ్జల, సిఎం ప్రధాన సలహాదారు మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అజేయ కల్లాం, సిఎం సలహాదారు సీనియర్ ఐఎఎస్ అధికారి ఎం

శామ్యూల్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (కమ్యూనికేషన్స్) జివిడి కృష్ణమోహన్ పదవీ కాలాన్ని మరోసారి పొడిగించారు. మొదట్లో ప్రభుత్వ సలహాదారుల పదవీకాలాన్ని మూడేళ్లుగా కేబినెట్ ర్యాంకు హోదాతో 2019లో ఉత్తర్వులిచ్చారు. ఆ తర్వాత పదవీ కాలాన్ని రెండేళ్లకు కుదించారు. ఇప్పటికే రెండు పర్యాయాలు పదవీకాలం పొడిగించారు.

విశాఖ ఎంపి ఎంవివి భార్య, కుమారుడు కిడ్నాప్

- ప్రత్యేక బృందాలతో కేసును ఛేదించిన పోలీసులు
- అదుపులో ప్రధాన నిందితుడు హేమంత్ కుమార్

3



భీమవరం కమిషనరుపై చర్యలు తీసుకోండి

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భీమవరం మున్సిపల్ కార్యాలయంలో దళిత చర్మకారులను, ఉద్యోగులను అవమానించిన కమిషనరుపై కఠిన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి గురువారం కమిషనర్ ఆఫ్ డైరెక్టర్ అండ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 13న మెప్మా ఆధ్వర్యాన దళిత చర్మకారులతో జరిగిన సమావేశంలో కుర్చీల్లో కూర్చున్నవారిని లేపి బయటకు పంపారని అన్నారు. ఓ వైపు ఎస్‌సి కార్పొరేషన్ ఇడికి సమస్యలను కెవిపిఎస్ నాయకులు కె క్రాంతిబాబు వివరిస్తుండగానే బయటకు వెళ్లిపోవాలని కమిషనరు గట్టిగా కేకలు వేశారని తెలిపారు. దీంతో మెప్మా అధికారులు బలవంతంగా చర్మకారులను బయటకు పంపేశారని పేర్కొన్నారు. అక్కడ సమావేశం ఏర్పాటు చేసిన ఎస్‌సి కార్పొరేషన్ ఇడిని కూడా తమ కార్యాలయంలో దళితులతో సమావేశం ఎలా పెడతావని అవమానించారన్నారు. ఎస్‌సి కార్పొరేషన్ ఇడి వారిస్తున్నా.. వినకుండా కమిషనరు అవమానించారని అన్నారు. చర్మకారులతో బలవంతంగా కార్యాలయాన్ని, కార్యాలయ ఆవరణను శుభ్రం చేయించుకున్న కమిషనరుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలవరాన్ని పరిశీలించిన ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ

ప్రజాశక్తి - పోలవరం

కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ సభ్యులు గురువారం పోలవరం ప్రాజెక్టును పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టుకు చేరుకున్న ఈ బృందం తొలుత దెబ్బతిన్న గైడ్ బండ్, రిటైనింగ్ వాల్‌ను పరిశీలించింది. అనంతరం పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎగువ, దిగువ కాఫర్ డ్యాములు, గ్యాప్ 1, 2, 3 ప్రాంతాలను పరిశీలించింది. పనుల వివరాలను ఎస్ఇ నరసింహమూర్తి, సిఇ సుధాకర్‌బాబు, జలవనరుల శాఖ అధికారులు బృందానికి వివరించారు. ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీకి చైర్మన్‌గా ఐసిఐడి సెక్రటరీ జనరల్ ఎబి.పాండే వ్యవహరించగా సభ్యులుగా ఎస్‌కె.సిబల్, డాక్టర్ ఆర్.చిత్ర, వివేక్ త్రిపాఠి, మహమ్మద్ ఖయ్యూం, మనీష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

హమాలీ సంఘాన్ని దూషించిన కామేశ్వరరావు క్షమాపణ చెప్పాలి

- సిఐటియు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ఎపిఎస్‌బిసిఎల్ అండ్ ఐఎంఎఫ్ డిపో హమాలీ యూనియన్‌ను, యూనియన్ నాయకులను అవమానించిన లిక్కర్ అండ్ బీర్ సప్లయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం కామేశ్వరరావు తక్షణమే క్షమాపణ చెప్పాలని సిఐటియు అనుబంధ సంఘమైన ఎపిఎస్‌బిసిఎల్ అండ్ ఐఎంఎఫ్ డిపో హమాలీ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం యూనియన్ గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు, అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌వి సుబ్బారెడ్డి, ఎం మదన్‌మోహన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలలో విధులు బహిష్కరించి క్షమాపణ చెప్పాలని నిరసన తెలిపామని పేర్కొన్నారు. శుక్రవారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని తెలిపారు.

నకిలీ, నాణ్యతలేని మందులు అరికట్టాలి

- ఔషధ నియంత్రణశాఖ సమీక్షలో మంత్రి రజిని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఔషధాల విక్రయంలో అవకతవకలు, నకిలీ మందులు, నాణ్యతలేని మందుల అమ్మకాలను అరికట్టాలని అధికారులను వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఆదేశించారు. మంగళగిరిలోని వైద్యారోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో గురువారం ఔషధ నియంత్రణశాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నకిలీలపై డిజి స్థాయిలో తనిఖీలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సమర్థవంతంగా పనిచేయాలని, దీనికోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో ఎలా వాడుకోవాలో పరిశీలించాలని కోరారు. నకిలీ మందుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. హోల్‌సేల్ షాపులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది ఖాళీల భర్తీకి సంబంధించిన నివేదిక తయారు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఔషధ నియంత్రణకు సంబంధించిన ప్రాంతీయ కార్యాలయాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నకిలీ మందుల చెలామణిలో అడ్డుకట్ట వేసేందుకు విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రి విడదల రజిని తెలిపారు. అవినీతి కార్యకలాపాలకు సంబంధించి ఏర్పాటుచేసిన సిఆర్ యు ఫిర్యాదుల వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. మెడికల్ షాపుల్లో పనిచేసే ఫార్మాసిస్టుల జియో ట్యాగింగ్ విషయాన్ని పరిశీలించాలన్నారు. నిషేధిత మందులను పూర్తిస్థాయిలో అరికట్టడం, నకిలీ మందులు లేకుండా చూడటం శాఖలో అందరి కర్తవ్యమని సూచించారు. కొత్త డిజిగా బాధ్యతలు చేపట్టిన కొల్లి రఘురామిరెడ్డి.. మంత్రిని పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ స్పెషల్ సిఎస్ ఎమ్‌టి కృష్ణబాబు, అధికారులు జెడి గుప్తా తదితరులు పాల్గొన్నారు.

'చించినాడ' దళితులకు న్యాయం చేయాలి

- సిఎంకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు లేఖ
- రాష్ట్రంలో ఎక్కడా లేనంత వేగంగా కేసుల నమోదు
- కాంట్రాక్టరుకు రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం వత్తాసు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నిరంతరం పేదల పక్షాన ఉంటానని ప్రకటిస్తున్న సిఎం చించినాడ దళితులకు న్యాయం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సిపిఎం రాష్ట్ర కమిటీ తరపున గురువారం లేఖ రాశారు. రాష్ట్రంలో ధనిక, పేదల మధ్య వర్గపోరాటం జరుగుతున్నదని, తాము పేదల పక్షమని సిఎం ప్రకటించారని, దీన్ని నిజంగా నమ్మి ఆచరిస్తే సంతోషమేనని, కానీ ప్రభుత్వ ఆచరణ అందుకు విరుద్ధంగా ఉందని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడలో రెండు నెలలుగా పోలీసు, రెవెన్యూ యంత్రాంగం గ్రామ దళితులపై దాడి చేస్తున్నదని పేర్కొన్నారు. వారి పట్టా హక్కులను గానీ, హైకోర్టు డైరెక్షన్‌ను గానీ లెక్క చేయకుండా ప్రభుత్వ యంత్రాంగం ఇష్టానుసారం వ్యవహరిస్తున్నదని అన్నారు. ఇది సిఎంగా మీ దృష్టికి వచ్చి ఉండొచ్చని, అయినా యథేచ్ఛగా దాడి సాగుతోందని తెలిపారు. అక్కడ దళితులు, పేదలకు వ్యతిరేకంగా ప్రభుత్వ యంత్రాంగం వ్యవహరిస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలూ తీసుకోకపోగా తిరిగి దళితుల పైనే దాడి ఎక్కుపెడుతున్నారని వివరించారు. ఇదేనా సిఎంగా చెబుతున్న వర్గ పోరాటం యొక్క అర్థం అని ప్రశ్నించారు. అదే నిజమైతే వైసిపి ప్రభుత్వం నూటికి నూరుపాళ్ల సంపన్నుల కొమ్ముకాస్తున్నట్లేనని విమర్శించారు. ఇప్పటికైనా తక్షణమే చించినాడ దళితులకు న్యాయం చేయాలని కోరారు. 1983లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం భూ పంపకంలో భాగంగా చించినాడలో 280 దళిత కుటుంబాలకు 60 ఎకరాలు అసైన్‌మెంట్ పట్టా ఇచ్చిందని, దాన్ని వారు సొసైటీగా ఏర్పడి సాగు చేసుకుంటున్నారని తెలిపారు. దాన్ని ఆనుకుని గోదావరి ఒడ్డున పెరుగులంక భూములున్నాయని, ప్రభుత్వ ల్యాండ్ కమిషనర్ జిఓ ప్రకారం పట్టా భూములను ఆనుకున్న పెరుగులంక భూములు ఆ రైతులకే చెందుతాయని పేర్కొన్నారు. కోర్టు కూడా దీన్ని ధ్రువీకరించిందని, ఈ భూములకు అటూ ఇటూ గోదావరి ఒడ్డున వున్న పెరుగులంక భూములన్నీ ఆయా రైతుల ఆధీనంలోనే ఉన్నాయని తెలిపారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఏ భూముల జోలికీ పోకుండా కేవలం దళితుల భూముల్లోనే మట్టి తవ్వి జగనన్న కాలనీలకు తోలేందుకు ఆదేశాలు జారీ చేసిందని, ఇది పూర్తిగా అన్యాయమని, దళితులపై కక్ష సాధింపుతో ప్రభుత్వ యంత్రాంగం చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పెరుగులంక భూములపై అధికారం దాన్ని ఆనుకుని ఉన్న దళితులదేనని, 1975 ల్యాండ్ కమిషనర్ ఆఫ్ సర్వే అండ్ సెటిల్‌మెంట్ జిఓ 147/75 జారీ చేశారని, తర్వాత హైకోర్టు ఆదేశం దీన్ని ధ్రువీకరించిందని పేర్కొన్నారు. గోదావరి ఒడ్డుకు ఐదు అడుగులు కూడా దూరం లేని విధంగా మట్టి తవ్వుతున్నారని, దీనివల్ల గోదావరి పొంగినప్పుడు వరదలు గ్రామాల్లోకి, పొలాల్లోకి పొంగి పొర్లే అవకాశం ఉందని, ఇది నదుల రక్షణ చట్టానికి విరుద్ధమని, అయినా మైనింగ్ డిపార్ట్‌మెంట్ మట్టి తవ్వేందుకు అనుమతినిచ్చిందని, ఈ భూములపై మైనింగ్ డిపార్ట్‌మెంట్‌కి ఎలాంటి అధికారం లేదని తెలిపారు.

దళితులు తమ పొలాల్లోకి వెళ్లేందుకు వేసుకున్న రోడ్డును మట్టి తోలేందుకు అక్రమంగా వినియోగిస్తున్నారని, వారు రైతుల నుండి ఎలాంటి అనుమతి తీసుకోలేదని, నష్టపరిహారమూ చెల్లించలేదని లేఖలో ప్రస్తావించారు. రోడ్డుకి ఇరువైపులా దళితులు కొబ్బరిచెట్లు నాటుకున్నారన్నారు. వాటన్నింటినీ ప్రభుత్వ యంత్రాంగం కాంట్రాక్టర్లతో కలిసి నాశనం చేయడమే కాకుండా మరలా తిరిగి మట్టి తోలకానికి అనుకూలంగా రోడ్లు వేసుకున్నారని వివరించారు. తమ పొలాల్లోకి వెళ్లేందుకు దళిత రైతులను పోలీసులు అనుమతించడం లేదని, ఇదెక్కడి ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. జగనన్న కాలనీలకు మట్టితోలే పేరుతో లారీలను ఇటుక బట్టీలకు, రియల్ ఎస్టేట్ డెవలపర్లకు తోలుతున్నారని పేర్కొన్నారు. ఈ అంశాలను పరిశీలిస్తే మట్టితోలే కాంట్రాక్టరు అన్ని నిబంధనలూ తుంగలో తొక్కి అక్రమంగా భూముల్లోకి ప్రవేశిస్తున్నట్లు అర్థమవుతుందని, వారిపై ఎలాంటి చర్యా తీసుకోకుండా భూముల పరిరక్షణకు, న్యాయం కోసం పోరాడుతున్న దళితులపై పోలీసులు దౌర్జన్యాలు చేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారని, అరెస్టులు చేస్తున్నారని వివరించారు.

మట్టి అక్రమ తోలకాన్ని అడ్డుకున్నందుకు దళితులపై కేసులు పెడుతున్నారని, పొలాల్లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న మహిళలపై లాఠీచార్జి చేసి తలలు పగులగొట్టారని తెలిపారు. 13వ తేదీన శాంతియుతంగా సభ జరుపుకుని రోడ్డు మీదకు వస్తున్న గ్రామ దళితులు, వారికి అండగా వచ్చిన వివిధ పార్టీలు, సంఘాల నాయకులను ఎలాంటి కారణం లేకుండా అరెస్టు చేశారని, సభకు ముందురోజు గ్రామంలో పోలీసులు దిగి ఒక భయానక వాతావరణాన్ని సృష్టించారని పేర్కొన్నారు. అరెస్టయిన వారిపై యలమంచిలి పోలీస్‌స్టేషన్లో అప్పటికప్పుడు కేసు బుక్ చేసి ఎఫ్‌ఐఆర్ కూడా రిజిస్టర్ చేశారని, కానీ రాష్ట్రంలో గానీ, చించినాడ గ్రామంలో గానీ దళితులపై జరిగిన దాడులపై ఫిర్యాదు చేస్తే ఎక్కడా ఇంత వేగంగా స్పందించలేదని పేర్కొన్నారు. విచారణ పేరుతో రోజులు గడపడం లేదా దళితులను బెదిరించేందుకు కౌంటర్ కేసులు పెట్టడం, కేసు బుక్ చేయకుండా రాజీలు కుదర్చడం వంటి పనులు పోలీసు యంత్రాంగం చేస్తున్నదని శ్రీనివాసరావు తెలిపారు. అయినా ఎటువంటి చర్యా తీసుకోవడం లేదని, దళితులకు రక్షణగా ఉన్న చట్టాలను తుంగలో తొక్కి సంపన్నుల కొమ్ము కాయడమే సిఎం పోరాట లక్ష్యంగా కనిపిస్తున్నదని విమర్శించారు.

తక్షణమే చించినాడలో పోలీసులను ఉపసంహరించి దళితుల భూములు దళితులకు అప్పగించి అక్రమంగా మట్టి తవ్వుతున్న కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్టరుకు కొమ్ముకాస్తున్న పోలీసు, రెవెన్యూ యంత్రాంగంపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించి చర్యలు తీసుకోకపోతే దళితులకు వ్యతిరేకంగా మట్టి మాఫియాకు ప్రభుత్వం కొమ్ము కాస్తున్నట్లు భావించాల్సి ఉంటుందని తెలిపారు.

తమ సమస్యలను చంద్రబాబు నాయుడుకు తెలియజేస్తున్న అంగన్వాడీ వర్కర్లు

అంగన్‌వాడీలకు అండగా ఉంటా..!

- సంఘీభావం తెలిపిన చంద్రబాబు

ప్రజాశక్తి - కుప్పం, గుడిపల్లి

'అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరిస్తా' అని నారా చంద్రబాబునాయుడు అన్నారు. రెండో రోజు రోడ్డు షోలో భాగంగా అంగన్‌వాడీల నిరసనకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు మాట్లాడుతూ పనిభారం ఎక్కువ మోపుతున్నారని, అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని, పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన పై విధంగా స్పందించారు.

కుప్పం నియోజకవర్గంలో మూడు రోజుల పర్యటనలో భాగంగా రెండోరోజు కుప్పం ఆర్‌టిసి బస్టాండ్ ప్రాంగణంలో భారీ బహిరంగసభ నిర్వహించారు. 'మీరు అండగా ఉంటే మీ భవిష్యత్ నా బాధ్యత' అని అన్నారు. కుప్పం నియోజకవర్గంలో ప్రతి ఎకరాకూ హంద్రీనీవా కాలువ ద్వారా నీళ్లు అందిస్తానని హామీ ఇచ్చారు. 2024లో అధికారం తమదేనని, అక్రమ కేసులకు భయపడకుండా పార్టీ బలోపేతానికి పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. సూపర్ సిక్స్ మినీ మ్యానిఫెస్టోతో రాష్ట్ర ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మునిరత్నం, కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ ఆర్.చంద్రశేఖర్, త్రిలోక్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బిసిఎన్ కల్యాణ మండపంలో కుప్పంకు చెందిన ప్రముఖ వైద్యులు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో వెయ్యిమంది కాంగ్రెస్ శ్రేణులు, వైసిపి కార్యకర్తలు దాదాపు 800 మంది టిడిపిలో చేరారు. గ్రూపు రాజకీయాలు చేస్తే సహించబోనని ,మెజార్టీ పెంచుకునేలా శ్రేణులు కలసికట్టుగా పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. 'ప్రజాబలమే నా బలం .. రానున్నది మన ప్రభుత్వమే' అని ఉద్ఘాటించారు. ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద స్థానికుల నుంచి అర్జీలను స్వీకరించారు.

స్థానిక సమస్యలపై అధ్యయనం

- గొల్లప్రోలుకు చేరిన వారాహి యాత్ర
- పలువురితో పవన్ సమావేశం, జనవాణి నిర్వహణ

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

అన్ని నియోజక వర్గాలలోనూ తిరిగి సమస్యలపై లోతైన అధ్యయనం చేయడానికి వారాహి యాత్రను చేపట్టానని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెలిపారు. వారాహి యాత్ర 2వ రోజైన గురువారం కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలుకు చేరింది. గొల్లప్రోలులోని సత్యకృష్ణ ఫంక్షన్ హాలులో స్థానిక సమస్యలపై అధ్యయనం చేసే జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేలపై కూర్చుని వికలాంగుల సమస్యలను వింటున్న పవన్ కల్యాణ్

ఇందులో భాగంగా పిఠాపురం నియోజకవర్గ అంశాలు, పరిస్థితులు, సమస్యలపై స్థానికంగా ఉన్న పలురంగాల ప్రముఖులు, విద్యావేత్తలు, వ్యాపారులతో పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. నాదెండ్ల మనోహర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరుగా బాధితుల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకుంటున్నానన్నారు. అరాచక పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జనవాణి ద్వారా తెలుసుకుంటున్నానని తెలిపారు. జనవాణిలో వచ్చిన సమస్యలపై భవిష్యత్తులో పోరాటం చేస్తానని తెలిపారు. జనవాణిలో 34 అంశాలపై అందిన ఫిర్యాదులను స్వీకరించారు. మెటీరియల్ ధరలు పెరిగాయని, జిఎస్‌టి కారణంగా చేనేత కుదేలైందని, కార్మికులు ఉపాధి కోసం వలసపోతున్నారని తాటిపర్తి గ్రామానికి చెందిన కాకి గంగాధర్ తెలిపారు. ఇదే గ్రామంలో చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారని, ఫలితంగా సాగునీరు అందట్లేదని, తవ్వకాలను అడ్డుకుంటే తప్పుడు కేసులు పెట్టారని అడబాల వీర్రాజు ఫిర్యాదు చేశారు. శ్మశాన వాటిక స్థలం లేక అంత్యక్రియలకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని యు కొత్తపల్లి మండలం ఉప్పాడకు చెందిన శివశంకర్ జనసేన దృష్టికి తెచ్చారు. కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనాలు అమలయ్యేలా చూడాలని పిఠాపురం పట్టణానికి చెందిన పారిశుధ్య కార్మికుడు కిశోర్ విన్నవించుకున్నారు. అనంతరం వికలాంగుల వద్దకు పవన్ కల్యాణ్ నేరుగా వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అటు పిమ్మట ఆయన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన జనసేన వీర మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.

పర్మినెంట్ చేయాల్సిందే

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి- యంత్రాంగం

గత ఎన్నికల ముందు ప్రతిపక్షనేతగా వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ఆందోళనకు దిగారు. పర్మినెంట్ చేయాలని, 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్లు అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ విధానాన్ని అమలు చేయాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు జిఓ 7 ప్రకారం రూ.18,500 గౌరవ వేతనం ఇవ్వాలని తదితర డిమాండ్లలో కార్పొరేషన్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు, నగర పంచాయతీల వద్ద ధర్నా చేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, సిఐటియు ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ధర్నాలో వక్తలు మాట్లాడుతూ 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు అనేకమార్లు ఫోన్లు చేసి పర్మినెంట్ విషయమై అడిగితే. అది రాజకీయ వాగ్దానమని, తమకు సంబంధం లేదని కాల్ సెంటర్ నుండి చెబుతున్నారన్నారు. జగనన్నే మా నమ్మకం అని ఇంటింటికీ స్టిక్కర్లు అతికిస్తున్నారని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడే మున్సిపల్ కార్మికులు జగనన్నను నమ్మారని అన్నారు. నమ్మినందుకు అధికారంలోకి వచ్చిన తర్వాత నట్టేట ముంచారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గాజువాక, మధురవాడల్లోని జివిఎంసి జోనల్ కార్యాలయాల వద్ద మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 వేతనం ఇవ్వాలని, రిస్క్ అలవెన్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయం వద్ద చేస్తున్న కార్మికులు

సమస్యలను ఈ నెల 18లోగా పరిష్కరించకుంటే 19 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ మేరకు జోనల్ కమిషనర్లకు వినతిపత్రాలు అందజేశారు.

నెల్లూరులో ర్యాలీ, కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఏలూరు, కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. అనంతపురం, కర్నూలు, శ్రీకాకుళం, కడప కార్పొరేషన్లపాటు, పార్వతీపురం, సాలూరు, పాలకొండ, రాజాం పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, బద్వేలు, రాజంపేట, గూడూరు, తాడేపల్లిగూడెం, తణుకు, నంద్యాల, డోన్, ఆత్మకూరు, రాయదుర్గం, గుంతకల్లు, కదిరి, ధర్మవరం, నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు, కొండపల్లి తదితర మున్సిపాల్టీల్లో ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయకపోతే పోరాటం ఉధృతం : ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలనే డిమాండ్‌తో రాష్ట్ర వాప్తంగా గురువారం నిర్వహించిన ధర్నాలు జయప్రదమైనా.. ప్రభుత్వం స్పందించకపోవడం తగదని ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, అధ్యక్షులు కె నాగభూషణం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయకపోతే అంచెలంచెలుగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న వి శ్రీనివాసరావు, కె రామకృష్ణ, బోండా ఉమామహేశ్వరరావు, గిడుగు రుద్రరాజు తదితరులు

మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధం

- సిపిఐ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు
- 18న వామపక్షాల ఆధ్వర్యాన రాష్ట్రస్థాయి సదస్సు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలు, సర్‌ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలంటూ రకరకాల పేర్లతో ప్రజలపై పెనుభారంగా మారిన విద్యుత్ భారాలను తక్షణం ఉపసంహరించుకోకుంటే బషీర్‌బాగ్ లాంటి మరో విద్యుత్ ఉద్యమానికి సిద్ధం కావాలని అఖిలపక్ష నేతలు ప్రజలకు పిలుపునిచ్చారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను వ్యతిరేకిస్తూ సిపిఐ ఆధ్వర్యాన గురువారం విజయవాడ దాసరి భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జగన్ 'పవర్' దెబ్బ వడదెబ్బ కన్నా భయంకరంగా వుందన్నారు. 20 ఏళ్ల క్రితం బషీర్‌బాగ్ ఉద్యమం తరువాత టిడిపి, కాంగ్రెస్ ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీల జోలికి వెళ్లలేదన్నారు. వినియోగదారులు చేసే ఆందోళనలకు రాజకీయ పార్టీలు మద్దతునివ్వాలని సూచించారు. గ్రీన్ ఎనర్జీ పేరుతో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ఎకరాల కొద్దీ భూములను అప్పనంగా కట్టబెడుతున్నారని విమర్శించారు. రైతుకు ఏడాదికి రూ.30 వేలు ఇస్తున్నారని, కంపెనీలకు ఆరు లక్షల నుండి ఏడు లక్షల రూపాయల ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ నెల 18న వామపక్షాల ఆధ్వర్యాన విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వానికి విద్యుత్ షాక్ తప్పదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యుత్ సంస్కరణలను ప్రభుత్వం ఎనలేని ఉత్సాహంతో వేగవంతంగా అమలు చేస్తోందన్నారు. రకరకాల ఛార్జీల పేరుతో ప్రజలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదేపదే వీరబాదుడు బాదుతున్నారని విమర్శించారు. ఎలాంటి అవసరంగానీ, ఎవరూ కోరడంగానీ జరగకపోయినా స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు పేరుతో భారీ దోపిడీకి పాల్పడుతున్నారని అన్నారు. రాజస్థాన్, చండీగఢ్‌లో రూ.7,100, రూ.7,900కు స్మార్ట్‌మీటర్లు లభిస్తుండగా, ఎపిలో మాత్రం ఒక్కోస్మార్ట్ మీటర్‌కు రూ.36,970 వెచ్చిస్తున్నారంటే ఇంతకన్నా దోపిడీ మరోటి ఉంటుందా? అని ప్రశ్నించారు. ప్రత్యేకించి షిర్డీసాయి కంపెనీకి, అదానీ కంపెనీతో జరిగిన విద్యుత్ ఒప్పందాలను పునస్సమీక్షించాలని డిమాండ్ చేశారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఇతర మాఫియాల మారిదిగా కాకుండా రాష్ట్ర ప్రజలందరిపై భారం వేసే అవకాశం కరెంటు ఛార్జీల ద్వారా జరుగుతుందన్నారు. తమిళనాడు, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లో లేని ఛార్జీల పెంపు ఇక్కడే ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. వాలంటీర్ వ్యవస్థ వచ్చిన తరువాత ఇళ్లల్లోకి ప్రవేశించి మీరు ఇది వాడుతున్నారు, అది వాడుతున్నారంటూ ఎరియర్స్ అని చెపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ.. ఏడు పద్ధతుల్లో విద్యుత్ ఛార్జీలు వసూలు చేస్తున్నారని, కిందస్థాయి అధికారులకు కూడా అర్థం కావటం లేదని తెలిపారు. సిపిఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర నాయకులు డి హరనాథ్ మాట్లాడుతూ.. వ్యవసాయ మీటర్లు బిగించినప్పుడు జియో టవర్స్‌ను తగులబెట్టారని గుర్తు చేశారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు కరెంటు ఛార్జీలు పెంచడానికి భయపడితే సిఎం జగన్ నాలుగేళ్లలో ఎనిమిదిసార్లు పెంచేశారని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, పెన్మెత్స దుర్గాభవాని, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎంవి ఆంజనేయులు, నవక్రాంతి పార్టీ అధ్యక్షులు రావు సుబ్రమణ్యం మాట్లాడారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి ఈశ్వరయ్య ప్రవేశపెట్టిన విద్యుత్ ఉద్యమంపై చేపట్టే కార్యాచరణ తీర్మానాన్ని రౌండ్‌టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ కార్యక్రమంలో టిడిపి నేత పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. సమావేశం జరుగుతున్న సమయంలోనే సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలి విద్యుత్ పోవడంతో సెల్‌ఫోన్లతో లైట్లు వేశారు.

బి.శ్రీనివాసాచారి

పి.రవికుమార్

ఎన్ షబ్బీర్

బి.శ్రీనివాసాచారి, పి.రవికుమార్, ఎన్ షబ్బీర్‌లకు వి. ఆర్. బొమ్మారెడ్డి స్మారక ఉత్తమ జర్నలిస్టు పురస్కారాలు

- ఎన్. పవన్ కుమార్‌కు అభినందనలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'ప్రజాశక్తి మంతుడు' వి.ఆర్ బొమ్మారెడ్డి పేర ప్రజాశక్తి కోసం 2007లో ప్రత్యేకంగా నెలకొల్పిన ఉత్తమ జర్నలిస్టు అవార్డును ప్రతి యేటా క్రమం తప్పకుండా (కోవిడ్ సమయంలో మినహా) ఇవ్వడం జరుగుతున్నది. ఈ ఏడాది బ్యూరో, స్టాఫర్స్ కేటగిరీలో రాజమహేంద్ర వరం స్టాఫర్ బి శ్రీనివాసాచారిని, మండల విలేకరుల కేటగిరిలో హిందూపురం, సింగరాయకొండ విలేకరులు ఎన్. షబ్బీర్, పి.రవికుమార్‌లను సంయుక్త విజేతలుగా అవార్డు ఎంపిక కమిటీ నిర్ణయించింది. బి శ్రీనివాసాచారి '20 రోజులుగా కొండలు.. గుట్టలపైనే..' అన్న శీర్షికతో గోదావరి వరదలో పోలవరం ముంపు బాధితులు పడిన అవస్థలపై క్షేత్ర స్థాయి నుంచి వరుసగా రాసిన కథనాలకు గాను ఈ అవార్డుకు ఆయనను ఎంపిక చేసింది. పి రవికుమార్ ' చెరువులో లే అవుట్.. కనుమళ్లలో భూ మాయ' అన్న శీర్షికతో రెవిన్యూ లీలలు, దళారీల పాత్ర, బాధితుల గోడుకు సంబంధించి రాసిన వరుస కథనాలకు, ఎన్ షబ్బీర్ 'కాలుష్య వలయం' పేరుతో పర్యావరణానికి నష్టం కలుగజేస్తున్న పరిశ్రమల యాజమాన్యాల పాత్రను లోతుగా విశ్లేషిస్తూ రాసిన కథనాలకు గాను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు కమిటీ వివరించింది. అలాగే అమరావతి బ్యూరోలో పనిచేస్తున్న ఎన్ పవన్ కుమార్‌ను కమిటీ ప్రత్యేకంగా అభినందించింది. ఆయన రాసిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై వేటు, కొనసాగింపు కథనాలు పాఠకుల్లోను, ఉద్యోగుల్లోను చర్చనీయాంశమయ్యాయి. ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డుతోబాటు, బొమ్మారెడ్డి స్మారక జర్నలిస్టు అవార్డులను ఈ నెల 20 పుట్టపర్తిలో జరిగే సభలో ప్రదానం చేయడం జరుగుతుందని ప్రజాశక్తి సాహితీ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.

మారుమూల ప్రాంతాలకు 4జి సేవలు

- 100 జియో టవర్లు ప్రారంభించిన సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మారుమూల ప్రాంతాలకు 4జి సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 209 గ్రామాలకు సేవలు అందించేందుకు ఏర్పాటుచేసిన 100 జియో టవర్లను గురువారం తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ పద్ధతిలో సిఎం ప్రారంభించారు. వీటిల్లో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 85 టవర్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో 10, అన్నమయ్య జిల్లాలో మూడు, వైఎస్ఆర్ జిల్లాలో రెండు టవర్లు ఉన్నాయి. వీటి ద్వారా ఆయా గ్రామాల్లోని సచివాలయాలు, ఆర్‌బికెలు, విలేజ్ క్లినిక్‌లు, ప్రభుత్వ పాఠశాలలకు మెరుగైన నాణ్యమైన సేవలు అందనున్నాయి. సెల్ టవర్లు ఏర్పాటు చేసిన ప్రాంతం నుండే సిఎంతో కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం భీమవరం నుండి ఎంపి గొడ్డేటి మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ, కలెక్టరు సుమిత్‌కుమార్, జి మాడుగుల మండలం సుబ్బులు గ్రామం నుండి పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఐటిడిఎ పిఒ వి అభిషేక్, పార్వతీపురం మన్యం జిల్లా సికల్‌బాయి గ్రామం నుండి కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, కలెక్టరు నిషాంత్‌కుమార్ సిఎంతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో సెల్ సర్వీసులు లేని 5,459 ఆవాసాలకు మొబైల్, ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. నూతనంగా టవర్లు ఏర్పాటు చేసిన ప్రాంతంలో 150 ఎంబిపిఎస్ డౌన్‌లోడ్, 50 ఎంబిపిఎస్ అప్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కేంద్రంతో మాట్లాడి 2,849 ప్రాంతాల్లో టవర్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైందని, దీనికోసం 2,463 చోట్ల స్థలాలు అప్పగించామని పేర్కొన్నారు.

1,610 రోజుల నుండి జైల్లోనే..

- జగన్‌పై దాడి కేసులో నిందితుడు సిజెఐకి లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : తాను 1,610 రోజుల నుండి బెయిల్ లేకుండా జైల్లోనే ఉన్నానని జగన్‌పై దాడిచేసిన కేసులో నిందితుడు శ్రీనివాస్.. సిజెఐకి లేఖ రాశారు. గురువారం ఎన్ఐఎ కోర్టులో ఈ కేసుపై విచారణ జరిగింది. కేసులో వాదనలు వినిపించేందుకు తమకు సమయం కావాలని ప్రస్తుత సిఎం జగన్ తరపున న్యాయవాది కోరడంతో జులై 4 నాటికి విచారణ వాయిదా వేశారు. అయితే ఇప్పటి వరకూ బెయిల్ లేకుండా జైల్లో ఉన్న శ్రీనివాస్ తనకు న్యాయం చేయాలని కోరుతూ సిజెఐకి లేఖ రాశారు. ఏళ్ల తరబడి జైల్లో ఉన్నా కనీసం బెయిల్ కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా ఎన్నాళ్లు ఉండాలో కూడా తెలియదని, తనపై దయ చూపాలని లేఖలో ప్రస్తావించారు.

ఇఇఎస్ఎల్‌కు రూ.651 కోట్ల బకాయి

- టిడిపి అధికార ప్రతినిధి పట్టాభి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జగన్ ప్రభుత్వం నిర్వాకంతో రాష్ట్రంలో మరో ప్రాజెక్టు అటకెక్కిందని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. టిడిపి జాతీయ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇఇఎస్-ఎల్‌కు రాష్ట్రం బకాయిలు ఇవ్వడం లేదని తెలిపారు. ఇప్పటి వరకూ రూ.522.74 కోట్లు అసలు కట్టాలని, సకాలంలో చెల్లించనందుకు రూ.128.81 కోట్లు జరిమానా పడిందని, మొత్తం రూ.651.55 కోట్లు చెల్లించాల్సి ఉందని అన్నారు. సకాలంలో డబ్బులు చెల్లించకపోతే వీధిదీపాల నిర్వహణ ప్రాజెక్టును రద్దు చేసుకుంటామని జూన్ 9న రాష్ట్ర ప్రభుత్వానికి ఇఇఎస్ఎల్.. సుప్రీం కోర్టు న్యాయవాది ద్వారా నోటీసు ఇచ్చిందని తెలిపారు. దీనివల్ల 24 లక్షల వీధిదీపాలు ఆగిపోతాయని అన్నారు. లక్షల కోట్లు అప్పులు తెస్తున్న జగన్ ప్రభుత్వం రూ.651 కోట్ల బకాయి ఎందుకు చెల్లించలేకపోయిందని పట్టాభి ప్రశ్నించారు. గత టిడిపి ప్రభుత్వంలో వీధిదీపాల ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని తెలిపారు. ఎన్‌టిపిసి, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ వంటి నాలుగు పిఎస్‌యులు కలిసి ఇఇఎస్ఎల్‌ను ఏర్పాటు చేశాయని అన్నారు.

వీధిలైట్ల జాతీయ కార్యక్రమ పర్యవేక్షణ కోసం ఈ సంస్థను నోడల్ ఏజెన్సీగా నియమించారని తెలిపారు. దీనివల్ల ఏడాదికి రూ.180 కోట్లు మిగులుతాయని అప్పటి పంచాయతీరాజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న నేటి సిఎస్ జవహర్‌రెడ్డి తెలిపారన్నారు. అప్పటి ఇంధనశాఖ కార్యదర్శి అజయ్‌జైన్ కూడా ప్రాజెక్టును కీర్తించారని గుర్తుచేశారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద అంగన్‌వాడీల ఆందోళనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రూ. 26 వేలు కనీస వేతనం ఇవ్వాలని, ఐసిడిఎస్ ప్రాజెక్టులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఐసిడిఎస్ ప్రాజెక్టుల వద్ద అంగన్‌వాడీలు ఆందోళనలు నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమం చేపట్టారు. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ ఇవ్వాలని, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవులు ఇవ్వాలని, రాజకీయ, అధికారుల వేధింపులు అరికట్టాలని నినదించారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

కాకినాడ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఆందోళన

అంగన్‌వాడీ కేంద్రాలకు నేరుగా రేషన్ బియ్యం పంపించాలని, వంట పాత్రలు, గ్యాస్ పొయ్యిలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని అన్ని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ధర్నాలు చేశారు. అనంతరం పిఒకు వినతిపత్రాలు అందజేశారు. తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లాల్లోని తహశీల్దార్, ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టారు. రాజమహేంద్రవరం ఐడిడిఎస్ కార్యాలయం వద్ద ప్లకార్డులతో ధర్నా చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలను అందించారు. తిరుపతి జిల్లాలో సత్యవేడు, పిచ్చాటూరు, వెంకటగిరి, పుత్తూరులో నిరసన తెలిపారు. చిత్తూరు జిల్లాలో పలమనేరు, కుప్పం, చిత్తూరు, కార్వేటినగరాల్లో ఆందోళన తెలిపారు. అనకాపల్లి జిల్లా సబ్బవరం, కశింకోట ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ, చింతూరు, విఆర్.పురం, రాజవొమ్మంగి ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టారు. శ్రీకాకుళంలో ప్రాజెక్టు సిడిపిఒ శోభారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి అనంతపురం, కడప, కర్నూలు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల వ్యాప్తంగా ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

జులై 12 నుంచి 'అనంత'లో సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు

ప్రజాశక్తి-అనంతపురం

జులై 12 నుంచి 14 వరకు అనంతపురం నగరంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు జరుగనున్నట్టు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ తెలిపారు.గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న మతతత్వ విధానాలు, విద్యుత్ సంస్కరణల పేరుతో రాష్ట్ర ప్రభుత్వ మోపుతోన్న భారాలపై, ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఎటువంటి ఉద్యమ కార్యచరణ రూపొందించాలన్న దానిపై రాష్ట్ర కమిటీ సమావేశాల్లో చర్చించనున్నట్లు చెప్పారు.

ఈ సమావేశాలకు పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, ఎంఎ. బేబి అతిథులుగా హాజరుకానున్నట్టు వివరించారు. 'వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి-కేరళ నమూనా' అన్న అంశంపై జులై 12న నగరం లోని ప్రముఖులు, మేధావులు, సామాజికవేత్తలతో ఎంఎ బేబి ముఖాముఖి సమావేశం కానున్నారని చెప్పారు. 13న నిర్వహించే బహిరంగ సభకు పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఓ.నల్లప్ప, బాలరంగయ్య, సిపిఎం నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, నాయకులు మసూద్ పాల్గొన్నారు.

సిఎం జగన్ దళిత ద్రోహి

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళిత ద్రోహి అని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. టిడిపి జాతీయ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగేళ్లలో సిఎం జగన్ ఎక్కడా కూడా దళితుల్లో మాదిగ కులస్తుల గురించి ప్రస్తావించలేదని, వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమరావతిలో అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ స్మృతి వనాలకు చంద్రబాబు శ్రీకారం చుడితే జగన్ అంబేద్కర్‌ను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారని తెలిపారు. మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మూరి కనకారావు తిరుగుతున్న కారు చంద్రబాబు హయాంలో కొనిచ్చినదేనని అన్నారు. చంద్రబాబు హయాంలో లబ్ధిపొందిన అనేక మంది ఇప్పుడు జగన్ పల్లకి మోస్తున్నారని విమర్శించారు.

బాసర ట్రిపుల్ ఐటిలో మరో విషాదం

మరో విద్యార్థిని మృతి
రెండ్రోజుల వ్యవధిలో రెండో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిర్మల్ జిల్లా బాసర ఆర్‌జియుకెటి యూనివర్సిటీలో విషాదం నెలకొంది. రెండ్రోజుల వ్యవధిలో యూనివర్సిటీకి చెందిన ఇద్దరు విద్యార్థినులు మృతిచెందడం కలకలం రేపుతోంది. దీపిక ఆత్మహత్య ఘటన నుంచి తేరుకోకముందే బుధవారం అర్ధరాత్రి సిద్ధిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన బూర లిఖిత హాస్టల్‌లోని నాల్గవ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు పడి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. గమనించిన సెక్యూరిటీ సిబ్బంది మొదట స్థానిక ఆస్పత్రికి తరలించారు.

అక్కడ నుంచి భైంసా ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరిశీలించి, నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రిలో పరీక్షించిన వైద్యులు లిఖిత అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. యూనివర్సిటీలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక విద్యార్థులు, తల్లిదండ్రులు మానసిక ఆందోళనకు గురవుతున్నారు. విద్యార్థి సంఘాల నాయకులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు యూనివర్సిటీలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. యూనివర్సిటీ విసి వెంకటరమణ ఆస్పత్రికి చేరుకొని లిఖిత మృతదేహాన్ని పరిశీలించారు. బయటకు వచ్చిన విసి వాహనాన్ని ప్రతిపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాల నాయకులు అడ్డుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థులు మృతి చెందుతున్నారని, ముమ్మాటికీ ఇవి ప్రభుత్వ హత్యలేనని విమర్శించారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లిఖిత తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, తల్లిదండ్రులకు అప్పగించారు. లిఖిత కుటుంబాన్ని ఆదుకుంటామని యూనివర్సిటీ విసి హామీ ఇచ్చారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసితులకు న్యాయం చేయాలి

- ఎపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య

ప్రజాశక్తి - కొయ్యలగూడెం (ఏలూరు)

గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని, లేకుంటే దశలవారీ ఉద్యమం చేపడతామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య హెచ్చరించారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల పోరాట కమిటీ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం పొంగుటూరు చర్చి సెంటర్ వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సదస్సు గురువారం నిర్వహించారు. సదస్సు అనంతరం గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను, రైతులు నష్టపోతున్న పంటలను సంఘం నాయకులు పరిశీలించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వి.కృష్ణయ్య మాట్లాడుతూ.. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం రైతుల నుంచి బలవంతంగా భూములు సేకరించి తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. జిల్లా కలెక్టర్, భూసేకరణ అధికారులు, హైవే అథారిటీ అధికారులు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. ఆర్బిట్రేషన్ పిటిషన్ల జడ్జిమెంట్ ఇవ్వకుండా ఆలస్యం చేయడం అన్యాయమని తెలిపారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఆర్బిటేషన్ పిటిషన్ల జడ్జిమెంట్ ఇచ్చి ప్రయివేటు మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. సర్వీస్ రోడ్లు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు కొడవటి రామకృష్ణ, ఆచంట గోపాలకృష్ణ, మార్ని శ్రీనివాస్ మాట్లాడారు. చెరకు, మొక్కజొన్న, పొగాకు, వరి తదితర పంటలు దెబ్బతిన్నాయని, నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

HDFC BANK
We understand your world

రిజిస్టర్డ్ ఆఫీస్: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోవర్ పారెల్ (పశ్చిమం), ముంబాయి-400013 మరియు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, 1వ అంతస్తు, I-తింక్ టెక్నో క్యాంపస్, కంజూర్ మార్గ్ (తూర్పు), ముంబాయి-400042 వద్ద ఉన్న రిటైల్ పోర్ట్ పోలియో నిర్వహణగా దాని కార్యాలయం ఒకటి.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌కి తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించిన విక్రయ సమాచారం మరియు పబ్లిక్ నోటీసు.

హెచ్‌డిఎఫ్‌సి (బ్యాంకు) యొక్క దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు బ్యాంకుకు తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించి, రుణం/ఓవర్‌డ్రాఫ్ట్ స్వభావంలో క్రెడిట్ సౌకర్యాలను పొందడం కోసం దీని ద్వారా తెలియజేయబడుతుంది. అంగీకరించిన లోన్ నిబంధనల ప్రకారం బకాయిలను తిరిగి చెల్లించడంలో రుణగ్రహీతల నిరంతర డీఫాల్ట్ కారణంగా, దిగువ రుణ ఖాతాలు అపరాధ స్థితిలో ఉన్నాయని బ్యాంకు ఈ రుణగ్రహీతలకు అనేక నోటీసులు జారీ చేసింది, దిగువ పేర్కొన్న తేదీలో తుది విక్రయ నోటీసుతో సహా, బ్యాంక్ ప్లెడ్జ్‌ను చేయించిన మరియు దిగువ ఖాతాలలో మొత్తం బకాయిలను తిరిగి చెల్లించడానికి రుణగ్రహీతకు 7 రోజుల సమయం ఇచ్చింది. విఫలమైతే బ్యాంక్ ఈ విషయంలో తదుపరి నోటీసు జారీ చేయకుండా తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విక్రయించడానికి స్వేచ్ఛ ఉంటుంది. రుణగ్రహీతలు నిర్లక్ష్యానికి గురయ్యారు మరియు సరియైన చెల్లింపులు చేయడంలో విఫలమయ్యారు, కాబట్టి రుణ బప్పందం ప్రకారం బ్యాంకు తన హక్కులను వినియోగించుకోవడంలో ప్లెడ్జీగా రుణగ్రహీతల నుండి బ్యాంకుకు చెల్లించాల్సిన బకాయిలను రికవరీ చేయడానికి 23 జూన్, 2023న లేదా ఆ తర్వాత సెక్యూరిటీలను విక్రయించడాని/పారవేయాలని నిర్ణయించింది. రుణగ్రహీతలు మార్జిన్ అవసరంలో మరింత లోపాన్ని సృష్టించడానికి స్టాక్ మార్కెట్‌లో అస్థిరత కారణంగా ఎప్పుడైనా తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విలువ మరింత పడిపోతే, ఈ విషయంలో తదుపరి నోటీసు లేకుండా బ్యాంకు తన అభీష్టానుసారం తాకట్టు పెట్టిన సెక్యూరిటీని క్యాలెండర్ రోజు ఒకటి (1) లోపు విక్రయిస్తుంది. రుణగ్రహీతలు ఏదైనా మిగిలిన బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడానికి, తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను విక్రయించడం ద్వారా వచ్చిన మొత్తాన్ని సర్దుబాటు చేసిన తర్వాత బ్యాంకుకు బాధ్యత వహిస్తారు.

క్ర. సం.	లోన్ ఎకౌంట్ నెం.	రుణగ్రహీతల పేర్లు	అసాధారణ మొత్తం 13 జూన్, 2023 నాటికి	విక్రయ నోటీసు యొక్క తేదీ
1	XXXX0603	ఎస్. లక్ష్మ నాయక్	19,98,657.72	07-Jun-23

తేదీ: 16.06.2023 సం/-
ప్రదేశం: ఆంధ్రప్రదేశ్ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్.

విశాఖ ఎంపి ఎంవివి భార్య, కుమారుడు కిడ్నాప్

- ప్రముఖ ఆడిటర్ జివి కూడా..
- ప్రత్యేక బృందాలతో కేసును ఛేదించిన పోలీసులు
- అదుపులో ప్రధాన నిందితుడు హేమంత్ కుమార్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

కిడ్నాప్ నుంచి బయటపడిన ఎంపీ ఎంవివి భార్య జ్యోతి, కుమారుడు శరత్ (ఫైల్‌ఫొటో)

విశాఖలో గురువారం కిడ్నాప్ కలకలం రేగింది. విశాఖ ఎంపి ఎంవివి సత్యనారాయణ భార్య జ్యోతి, కుమారుడు శరత్, ప్రముఖ ఆడిటర్, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ జి వెంకటేశ్వరరావు (జివి)లను భీమిలి ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ హేమంత్ కుమార్ కిడ్నాప్ చేశాడు. విశాఖలోని రుషికొండ వద్ద ఉన్న ఎంపి ఎంవివి సత్యనారాయణ కుమారుని ఇంటి వద్దే కిడ్నాప్ ఘటన రెండు రోజులుపాటు సాగడం గమనార్హం. ఈ ఘటన విశాఖలో తీవ్ర సంచలనం కలిగించింది. సమాచారం అందుకున్న నగర పోలీస్ కమిషనర్ సిఎం త్రివిక్రమ వర్మ వెంటనే ముగ్గురు డిసిపిల ఆధ్వర్యంలో 17 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఈ కిడ్నాప్‌ను ఛేదించారు. అనంతరం మీడియాకు త్రివిక్రమ వర్మ కేసు వివరాలను గురువారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం ఉదయం రుషికొండలోని ఎంపి కుమారుడు శరత్ ఇంటిలోకి ప్రధాన నిందితుడు హేమంత్ కుమార్, అతని అనుచరులు ప్రవేశించి శరత్‌ను నిర్బంధించారు. బుధవారం ఉదయం ఎంపి ఎంవివి సత్యనారాయణ ఆయన వ్యక్తిగత పనుల నిమిత్తం హైదరాబాద్ వెళ్లడంతో అతని భార్య జ్యోతి కుమారుడు శరత్ ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో ఆమెనూ కిడ్నాపర్లు నిర్బంధించారు. వీరిద్దరినీ అధిక మొత్తంలో నగదు డిమాండ్ చేసినా వారి వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు లభించలేదు. దీంతో వారి ద్వారానే ఆడిటర్ జివికి ఫోన్ చేయించారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం అక్కడికి చేరుకున్న జివిని నిర్బంధించి డబ్బులు డిమాండ్ చేశారు. తెలిసిన కాంట్రాక్టర్ల ద్వారా సుమారు 1.75 కోట్ల నగదును జివి సమకూర్చారు. ఈ క్రమంలో బుధవారం నుంచి జివి ఎటువంటి ఫోన్లకూ సమాధానం ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చిన ఎంవివి సత్యనారాయణ గురువారం ఉదయం నగర పోలీస్ కమిషనర్‌కు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సాంకేతికత ఆధారంగా రుషికొండలోని ఎంవివి తనయుడు ఇంటి వద్దనే జివి ఉన్నారని నిర్ధారించుకున్నారు. ఆ ఇంటికి సమీపిస్తుండగా పోలీసులు వస్తున్నారన్న విషయాన్ని పసిగట్టిన దుండగులు అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆనందపురం దగ్గరలో ప్రధాన నిందితుడు కోలా వెంకట హేమంత్ కుమార్‌తో పాటు మరొకరిని అదుపులోకి తీసుకున్నారు. కేసు విచారణ సాగుతోందని, పూర్తి వివరాలు మీడియాకు త్వరలో తెలియజేస్తామని సిపి త్రివిక్రమ వర్మ తెలిపారు. సమాచారం అందిన నాలుగు గంటల్లోనే దుండగులను పట్టుకుని కిడ్నాప్‌కు గురైన ముగ్గురినీ రక్షించామన్నారు. ఈ కిడ్నాప్‌కు వ్యాపార లావాదేవీలే కారణమని, ప్రధాన నిందితుడు హేమంత్ కుమార్‌పై గతంలో 12 కేసులు ఉండగా అందులో చివరి మూడు కేసులూ కిడ్నాపునకు సంబంధించినవేనని, పిఎం పాలెం పోలీస్‌స్టేషన్‌లో అతనిపై రౌడీషీట్ కూడా ఉందని సమాచారం.

Knowledge . Innovation . Excellence

లారస్ ల్యాబ్స్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం: లారస్ ఎన్‌క్లేవ్, ప్లాట్ ఆఫీస్ 01, ఇ. బోనంగి (గ్రా), పరవాడ (మ), అనకాపల్లి (జి) - 531021, ఆంధ్రప్రదేశ్
కార్పొరేట్ ఆఫీస్: 2వ అంతస్తు, సెరీన్ ఛాంబర్స్, రోడ్ నెం.7, బంజారా హిల్స్, హైదరాబాద్ - 500 034, తెలంగాణ
ఫోన్: +91 40 3980 4333, ఫ్యాక్స్: +91 40 3980 4320 ఇమెయిల్: secretarial@lauruslabs.com వెబ్‌సైట్:www.lauruslabs.com
Corporate Identity Number: L24239AP2005PLC047518

ప్రకటన

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, సెక్యూరిటీస్ అండ్ ఎక్ఛేంజి బోర్డ్ ఆఫ్ ఇండియా (ఎస్ఇబిఐ) మరియు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ (ఎంసిఏ) వారిచే జారీచేయబడిన సర్క్యులర్స్‌తో చదువబడే దాని క్రింది రూల్స్ మరియు కంపెనీల చట్టం, 2013 యొక్క నియమాలననుసరించి, కంపెనీ యొక్క 18వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజియం), శుక్రవారం, 14 జులై, 2023న మ॥ 03.00గం.లకు వీడియో కాన్ఫరెన్సింగ్ (విసి) లేదా ఇతర ఆడియో విజువల్ మాధ్యమాలు (ఓఏవిఎం) ద్వారా నిర్వహించుటకు షెడ్యూలు నిర్ణయించబడినది. మరియు వార్షిక సర్వసభ్య సమావేశం (ఎజియం) నోటీసు మరియు వార్షిక రిపోర్టులను ఎలక్ట్రానిక్‌గా డిస్పాచ్ చేయబడుచున్నవి.

తదుపరి, ఏజియం కొరకు రిజిష్టర్ ఆఫ్ మెంబర్స్ జులై 08, 2023 నుండి జులై 14, 2023 (రెండు రోజులుతో సహా) వరకు ('బుక్ ముగింపు తేదీలు') ముగిసియుంటాయి.

పై నిమిత్తం, ఎంసిఎ మరియు సెబి యొక్క సర్క్యులర్స్ ప్రకారం కంపెనీ/ రిజిస్ట్రార్ మరియు ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ (ఆర్‌టిఏ)/ డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో రిజిస్టరైన సభ్యుల ఇ-మెయిల్ చిరునామాకు ఎలక్ట్రానిక్ రూపంలో ఏజియం నోటీసు మరియు వార్షిక రిపోర్టు పంపబడుచున్నది. ఈ విషయంలో, సమాచారాలన్నింటి కొరకు సభ్యులు ఎవరి ఇమెయిల్ ఐడిలైతే వారి డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో రిజిష్టర్ కాని వారికి దిగువ సూచనల ద్వారా మెసర్స్ కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ది కంపెనీ యొక్క ఆర్‌టిఏ)తో లేదా వారి సదరు డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో వారి సదరు ఇమెయిల్ ఐడిలు రిజిస్టర్/అప్‌డేట్‌చేసుకోవలసిందిగా కోరబడుచున్నది.

■ ఇమెయిల్ ఐడి- **einward.ris@kfintech.com** పై కంపెనీ యొక్క ఆర్‌టిఏ, మెసర్స్ కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్‌కు మరియు కంపెనీకి ఇమెయిల్ ఐడి: **secretarial@lauruslabs.com** పై ఒక కాపీతో సబ్జెక్ట్ లైన్: **(unit-LAURUS LABS)** పేర్కొంటూ అభ్యర్ధనను పంపవచ్చును.

ఇమెయిల్ ఐడి రిజిస్టర్ చేసుకొనుట కొరకు:

- ఫోలియో నం./ క్లైంట్ ఐడి మరియు డిపి-ఐడి;
- వాటాదారు పేరు;
- షేర్ సర్టిఫికేట్ల (ఫిజికల్ హోల్డర్స్ కొరకు) యొక్క స్కాన్ కాపీ
- పాన్ కార్డు యొక్క సెల్ఫ్-అటెస్టెడ్ స్కాన్ కాపీ
- ఆధార్ కార్డు యొక్క సెల్ఫ్-అటెస్టెడ్ స్కాన్ కాపీ

ఏజియం నోటీసు మరియు వార్షిక రిపోర్టు కంపెనీ యొక్క వెబ్‌సైట్ **www.lauruslabs.com** లో అందుబాటులో ఉంటాయి మరియు నోటీసును స్టాక్ ఎక్ఛేంజిలు అనగా., బిఎస్ఇ లిమిటెడ్ **www.bseindia.com** మరియు నేషనల్ స్టాక్ ఎక్ఛేంజి ఆఫ్ ఇండియా లిమిటెడ్ **www.nseindia.com** వద్ద కూడా యాక్సెస్ కూడా చేయవచ్చును.

కంపెనీ సమావేశం జరుగు సమయంలో రిమోట్ ఇ-ఓటింగ్ సదుపాయం అదే విధంగా ఇ-ఓటింగ్ సదుపాయం సమకూర్చుతుంది. ఎవరైతే కంపెనీ/ఆర్‌టిఏ డిపాజిటరీ పార్టిసింపెంట్స్‌తో ఇమెయిల్ చిరునామా రిజిస్టరు చేసుకోలేదో అట్టి సభ్యులు రిమోట్ ఇ-ఓటింగ్ విధానం ద్వారా లేదా సమావేశం సమయంలో ఇ-ఓటింగ్ ద్వారా వారి ఓటును వేయవచ్చును కూడా మరియు రిమోట్ ఇ-ఓటింగ్ మరియు ఇ-ఓటింగ్ యొక్క వివరణాత్మక విధానం ఏజియం నోటీసులో ఇవ్వబడినవి.

డివిడెండ్స్ :
సభ్యులు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు డివిడెండ్ మొత్తాలు స్వీకరించుట కొరకు సదరు డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో బ్యాంక్ ఖాతా వివరాలను రిజిస్టర్/అప్‌డేట్ చేయవలసిందిగా కోరబడుచున్నది.

లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ తరపున
సం/- జి. వెంకటేశ్వర్ రెడ్డి
కంపెనీ సెక్రటరీ

ప్రదేశం: హైదరాబాద్
తేది: జూన్ 15, 2023

పంట పొలాల మధ్య ఆక్వా తవ్వకాలు ఆపాలి

- కలెక్టరేట్ వద్ద రైతుల ధర్నా

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

పచ్చని పంట పొలాల మధ్య అక్రమంగా సాగుతున్న ఆక్వా చెరువుల తవ్వకాలను తక్షణం ఆపాలని, తవ్వకాలకు అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టరేట్ వద్ద గురువారం రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు మామిడిశెట్టి రామాంజనేయులు, జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పెనుగొండ మండలం చినమల్లం, తాళ్లపాలెం, మిద్దెవారి పాలెం, నడిపూడి గ్రామాలను ఆనుకొని పంట పొలాల మధ్య ఆక్వా చెరువులు తవ్వుతున్నారని తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలో సుమారు 600 ఎకరాల్లో వరి సాగవుతోందన్నారు. పంట భూమి బ్యాంక్ కెనాల్ పంట కాలువను ఆనుకుని ఉందని, ఆ ప్రాంతంలో మురుగు కాలువ కూడా లేదని తెలిపారు. రెండు పంటలు పండే పంట భూముల్లో ఆక్వా చెరువులకు ఎలా అనుమతిచ్చారని ప్రశ్నించారు. రైతులు మాట్లాడుతూ గతంలో తవ్విన ఆక్వా చెరువుల వల్ల పంట పొలాలు దెబ్బతింటున్నాయని తెలిపారు. తాగు, సాగునీరు కాలుష్యమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వాపోయారు. చివరకు నోరులేని జీవాలు సైతం ఈ నీటిని తాగి మరణిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం అక్రమ అనుమతులు రద్దు చేసి చెరువుల తవ్వకాలను ఆపాలని జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణం తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కె సుబ్బరాజు, సిఐటియు నాయకులు ఎస్ వెంకటేశ్వరరావు, రైతులు, కౌలు రైతులు కె సూర్యనారాయణ, ఇ రాము, కె వెంకటనారాయణ, జి నాగేశ్వరరావు, సిహెచ్ ధర్మేంద్ర, కె హనుమంతరావు, వి సత్యనారాయణ, ఐ రాము, జి సత్యనారాయణ పాల్గొన్నారు.

జగన్‌తోనే దళితులకు ఆత్మగౌరవం : డొక్కా మాణిక్య వరప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దళితులకు ఆత్మగౌరవాన్ని పెంచేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దఎత్తున కార్యక్రమాలు చేపట్టారని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో దళితుల కోసం టిడిపి ఏం చేసిందో చెప్పాలన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఇద్దరు మాదిగలు, ముగ్గురు మాలలకు కీలక మంత్రిత్వశాఖలతో జగన్ మంత్రివర్గంలో చోటు కల్పించారన్నారు. దళితుల జీవితాల్లో వెలుగులు నింపాలన్న లక్ష్యంతో సిఎం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మూరి కనకారావు తెలిపారు. దళితుల చదువులపై టిడిపి ప్రభుత్వం ఏనాడైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టిందా? అని ప్రశ్నించారు.

పద్ధతి మార్చుకో పవన్

- డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన పద్ధతి మార్చుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సూచించారు. తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కత్తిపూడి సభలో పవన్ కల్యాణ్ చేసిన ప్రసంగం అర్థం పర్థం లేని ఆరోపణలతో జనంలో చులకన అయిపోతున్నారన్నారు. కాపు సామాజిక తరగతి అధికంగా ఉన్న గోదావరి జిల్లాలకు వచ్చి ఆ కాపులనే విమర్శించడం పవన్ రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని విమర్శించారు. కాపు రిజర్వేషన్లపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నది ఉన్నట్టు చెప్పారు గాని కాపులను మోసం చేయలేదని తెలిపారు. న్యాయపరంగా రిజర్వేషన్ కుదరదు కాబట్టే ఆనాడు జగ్గంపేట సభలో కాపు రిజర్వేషన్ సాధ్యం కాదని ధైర్యంగా చెప్పామన్నారు. 2014లో నువ్వు వత్తాసు పలికిన చంద్రబాబు కాపు రిజర్వేషన్ ఇస్తానని నమ్మించి ఓట్లు వేయించుకుని మోసం చేశారని విమర్శించారు. ఒకవైపు ముఖ్యమంత్రి అయ్యే సీన్ లేదంటూనే మరోవైపు అధికారంలోకి వస్తే అది చేస్తా, ఇది చేస్తానని చెప్పడం పవన్ కల్యాణ్ నిలకడ లేని మాటలకు నిదర్శనమన్నారు. అసలు ముఖ్యమంత్రి అభ్యర్థి నువ్వా.. చంద్రబాబా అని నిలదీశారు. పెళ్లి బిజెపితో, కాపురం చంద్రబాబుతో చేస్తావా? అని విమర్శించారు. సమావేశంలో వైసిపి నాయకులు కర్రి భాస్కరరావు, ఎం.సంపత్‌కుమార్, కె.ధర్మరాజు, కోసూరి వెంకటరాజు పాల్గొన్నారు.

సంపాదకీయం

బడి బయట పిల్లలు!

భావి భారత పౌరులుగా తీర్చిదిద్దబడవలసిన బాలబాలికలు బడిలో చదువుకు నోచుకోకపోవడం బాధాకరం. దేశంలో ప్రాథమిక స్థాయిలో రెండు శాతం, పదవ తరగతి స్థాయిలో 13 శాతం మంది పిల్లలు డ్రాపవుట్స్‌గా ఉన్నారని సాక్షాత్తూ కేంద్ర విద్యా శాఖ వెల్లడించింది. దేశంలో ప్రాథమిక స్థాయిలో బడికి పోని పిల్లలు 9.3 లక్షల మంది కాగా అందులో కేవలం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోనే 3.96 లక్షల మంది ఉండడం గమనార్హం. అసలు బడికే పోనివారు లేదా బడికి వెళ్లి మధ్యలో మానేసినవారు (డ్రాపవుట్స్) 2021-22 గణాంకాల ప్రకారం ఉత్తరప్రదేశ్, గుజరాత్, బీహార్, కర్ణాటక వంటివి ముందు పీఠిన ఉన్నాయి. వీటిలో బీహార్ మినహా మిగిలినవన్నీ ఆ కాలంలో బిజెపి ఏలుబడిలో ఉన్నవే. అందులోనూ అభివృద్ధిలో శరవేగంగా ముందుకు పోతున్నదని ఊదరగొట్టిన గుజరాత్ ఉండడం కమలనాథుల మోసకారితనానికి, ప్రచారార్భాటానికి నిలువెత్తు నిదర్శనం. ఏది ఏమైనా పిల్లలు బడి బయట ఉండకుండా విద్యాబుద్ధులు నేర్చుకునేట్టు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు చేపట్టాలి. భారత రాజ్యాంగం, విద్యాహక్కు చట్టం పేర్కొన్న స్ఫూర్తిని అమలు చేయాలి.

సెకండరీ స్థాయిలో బడి మానేస్తున్న పిల్లల సంఖ్య కొన్ని రాష్ట్రాల్లో జాతీయ సగటు కంటే చాలా ఎక్కువగా ఉంది. దేశంలోని స్కూలు డ్రాపవుట్స్‌లో 85 శాతం మంది కేవలం 11 రాష్ట్రాలకు చెందినవారే కావడం గమనార్హం. 2021-22లో జాతీయ సగటు 12.6% ఉండగా బీహార్ (20.4%), పంజాబ్ (21.7%), గుజరాత్ (20.3%), అసోం (17.8%), మేఘాలయ (17.2%), ఆంధ్రప్రదేశ్ (16.7%), కర్ణాటక (14.6%), తెలంగాణ (13.7%), రాష్ట్రాలు దానిని దాటేశాయి. సమగ్ర శిక్షా కార్యక్రమంపై చర్చించేందుకు కేంద్ర విద్యా శాఖ అందజేసిన వివరాలివి. వీటి ప్రకారం ఉత్తరప్రదేశ్‌లోని ఎనిమిది జిల్లాలలో వార్షిక సగటు డ్రాపవుట్ రేటు చాలా అధికంగా ఉండగా రాజస్థాన్‌లో ఈ రేటు నిలకడగా తగ్గుతూ వస్తోంది. అయితే సెకండరీ స్థాయిలో ఎస్టీలు, ముస్లింలలో మాత్రం ఈ రేటు చాలా ఎక్కువగా ఉంది. దేశంలోని వివిధ రాష్ట్రాలవారీగా, ఆయా వెనుకబడిన ప్రాంతాలు మరియు సామాజిక తరగతులవారీగానూ విశ్లేషించారు. మొత్తంగా చూస్తే దళిత, గిరిజన, ఒబిసి, మైనార్టీల్లో డ్రాపవుట్స్ అధికంగా ఉన్నాయి. అంటే ఆర్థిక సామాజిక వెనుకబాటుతనం విద్యావిషయకంగానూ కుంగదీస్తోంది. ఇదో విష వలయం.

బాలికా విద్య గురించి ఆలోచిస్తేనే కడుపు తరుక్కుపోతుంది. దేశంలోని ప్రతి ఐదుగురు బాలికల్లో ఒకరు నెలసరి (పీరియడ్స్)కి సంబంధించిన పరిజ్ఞానం సరిగా లేక, శానిటరీ ప్యాడ్స్ అందుబాటులో లేనందున చదువు మానుకుంటున్నారని ఒక అధ్యయనం ఇటీవల పేర్కొంది. గర్భస్త శిశువుగా ఉన్ననాటి నుండి వివక్షకు గురవుతున్న మహిళా లోకానికి చదువు విషయంలో పీరియడ్స్ సమస్య మరో కంటకం అయ్యింది. బడిలో చదువుకున్నపుడు కొందరు కీచక టీచర్లు లేదా బంధువులనే రాబందుల బారినుండి బయటపడి ఉన్నత చదువులకు వెళ్లాక ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ వంటి వేధింపులు వారిని వెంటాడుతున్నాయి. 1951 జనాభా లెక్కల ప్రకారం కేవలం 8.86 శాతంగా ఉన్న మహిళా సాక్షరత 2011 నాటికి 65.46 శాతానికి పెరగడం మంచి విషయమే కాని పెరుగుదల ఇంకా చాలా తక్కువే! గ్రామీణ మహిళల అక్షరాస్యత కేరళలో 94 శాతం కాగా బీహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కనీసం 50 శాతం కూడా లేకపోవడం సిగ్గుచేటు.

పిల్లలను పనికి పంపితే తప్ప కుటుంబం గడవని స్థితిలో కోట్లాదిమంది బాల కార్మికులుగా బతుకులు వెళ్లదీస్తున్నారు. ప్రాథమిక పాఠశాల ఒక కిలోమీటర్ పరిధిలోనే ఉండాలని విద్యాహక్కు చట్టం పేర్కొన్నా గిరిజన, మారుమూల వెనుకబడిన ప్రాంతాల్లో అటువంటి పరిస్థితి లేదు. అలా ఉన్నవాటిని కూడా పాఠశాలల విలీనం పేరుతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పిల్లలకు దూరం చేయడం దారుణం. ప్రజల ఆర్థిక సామాజిక కారణాలతోపాటు పాలకులు తమ బాధ్యతను సక్రమంగా నిర్వహించనందునే చదువుకోవాల్సిన పిల్లలు బడి బయట ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి మారాలి.

మహనీయుల మాట

రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో మహిళ అభివృద్ధి సాధించనంత వరకూ సామాజిక భద్రత రాదు. అందునా పురుషాధిక్యత ఉన్న సమాజం గనుక మహిళలు ఉద్యమించాలి.

- వి.ఐ.లెనిన్

విశ్లేషణ

అడవులు - చట్టాలు - గిరిజనుల మనుగడ

పి. మధు

అడవుల పరిరక్షణ చట్టం-1980కి బిజెపి ప్రభుత్వం 2023 మార్చి 29న సవరణ ప్రతిపాదించింది. ఇది అమలైతే అడవుల రక్షణే కాదు, గిరిజనుల మనుగడే ప్రమాదంలో పడుతుంది. అటవీ భూములను ఆఖరుకి గిరిజనుల స్వాధీనంలో వున్న భూములను ఇతర అవసరాల కోసమని (విద్యుత్ ప్రాజెక్టులు, మైనింగ్, పర్యాటకం పేరుతో) ప్రాజెక్టులకు మళ్లించడానికి వీలు కల్పించారు.

అడవులపై చట్టాలు - చరిత్ర

బ్రిటీషువారు మొదట 1865 లోనే అడవులపై చట్టం తెచ్చారు. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఏర్పడింది. దీన్ని మరింత కఠినతరం చేస్తూ 1878లో మరో చట్టం చేశారు. పై రెండు చట్టాలను, ఇతర కొన్ని కొత్త నిబంధనలను చేర్చి కొన్ని ముఖ్యమైన ప్రతిపాదనలతో 1927లో మరో చట్టం చేశారు. తద్వారా ప్రభుత్వానికి అడవులపై హక్కులు దఖలు పరిచారు. 1927లో రూపొందిన అటవీ చట్టం అడవులలో నివశించే గిరిజనుల జీవనం, వారి హక్కుల గురించి ఒక్క మాట పేర్కొనలేదు. వారి ఇళ్లకు, భూములకు, ఇతర అటవీ ఉప ఉత్పత్తుల మీద హక్కులకు ఈ చట్టంలో చట్టపరమైన హక్కులు గుర్తించలేదు. పైగా ఈ చట్టం ద్వారా రూపొందిన విధానాలు అడవుల్లో కలప సేకరణపై ప్రభుత్వానికి ప్రత్యేక హక్కులు కల్పించబడ్డాయి. కలప తరలింపుపై అనేక నిబంధనలు రూపొందించారు. అడవి, కలప, ఉప ఉత్పత్తులు మొదలగునవి పరిశ్రమల అభివృద్ధికి, పరిసరాల్లోని ప్రజల జీవనానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన ఆ రోజుల్లో బ్రిటీషు ప్రభుత్వం అంతకు ముందు చట్టాల కంటే మరింత పకడ్బందీగా అటవీ ఉత్పత్తులను కంట్రోల్ చేసే చట్టంగా ఇది రూపొందింది.

మొట్టమొదటి చట్టంలో (1865) అటవీ భూములన్నీ ప్రభుత్వ స్వాధీనం అయితే, 1927 చట్టంలో అడవుల్లో ఉత్పత్తి అయ్యే కలప ఇతర ఉత్పత్తులు అన్నీ బ్రిటీషు ప్రభుత్వ కంట్రోల్లోకి తేబడ్డాయి. ఈ కలపతోనే బ్రిటీషు ప్రభుత్వం ఇంగ్లండ్‌లో ఓడల నిర్మాణం చేపట్టింది. రైల్వే స్లీపర్లు (దుంగలు కొయ్యలతో) రైలు పట్టాలు నిర్మించింది. తమ వ్యాపారానికి రైల్వే లైన్లు, ఓడలు అవసరం అయిన తరుణంలో అడవుల సంపదపై పూర్తి పట్టు సాధించిన చట్టంగా 1927 చట్టం అమలులోకి వచ్చింది. ఈ కాలంలోనే మన అడవులు భారీ స్థాయిలో ధ్వంసం అయ్యాయి. బ్రిటీషు ప్రభుత్వం ఈ చట్టం ద్వారా అటవీ ప్రాంతాన్ని ఒక మంచి ఆదాయ వనరుగా రూపొందించింది. 1865 చట్టం బ్రిటీషు ప్రభుత్వానికి దట్టంగా చెట్లున్న ప్రాంతాన్ని అడవిగా ప్రకటించే అధికారం ఇస్తే, 1927 చట్టం అటవీ సంపద వలస రాజ్యం పూర్తిగా కొల్లగొట్టేదానికి అవకాశం ఇచ్చింది. భూముల్లో ప్రవేశించినా, కలపను తరలించినా అపరాధపు పన్ను వసూలుకు, చివరకు జైలు శిక్షలు విధించడానికి ఈ చట్టం బ్రిటీషు ప్రభుత్వానికి అధికారం ఇచ్చింది. మిలియన్ల కొద్దీ ప్రజలు అడవులలోనూ, అటవీ పరిసరాలలోనూ నివశిస్తున్నా వారికి ఏ విధమైన చట్టబద్ధమైన హక్కులు లేకుండా పోయాయి. 1880 జనాభా లెక్కల ప్రకారం గిరిజనుల జనాభా 70 మిలియన్లని (7 కోట్లు) అంచనా వేయబడింది. కానీ అటవీ అధికారులకు అటు అడవుల మీద, ఇటు అడవులలో నివశించే గిరిజనుల మీద మితిమీరిన అధికారాలు దఖలు పర్చబడ్డాయి. కేంద్ర ప్రభుత్వం 2023 చట్ట సవరణ ద్వారా 1927 చట్టం లాంటి విధానాల వైపు పరుగులు పెడుతోంది.

బ్రిటీషు ప్రభుత్వం అటవీ ప్రాంతాల్లో పాలనా యంత్రాగాన్ని వినియోగించి అడవులపై ఆధారపడిన గిరిజనుల కమ్యూనిటీల మీద, వారి జీవనంపైన విపరీతమైన ఆంక్షలు విధించింది. ఆహారం, వంట చెరుకు, మందులు, ఉప ఉత్పత్తుల వినియోగానికి ఈ ఆంక్షలు పెట్టారు. వాస్తవంగా అడవులలో నివశించే గిరిజనుల, వారి కమ్యూనిటీల విధానాలతోనే అభివృద్ధి చెందుతూ వచ్చిన అడవుల పరిరక్షణ పరిణామాన్ని బ్రిటీషు చట్టాలు దెబ్బకొట్టాయి.

తాజా సవరణ చట్టం

ఇప్పుడు 2023 మార్చి 29న అటవీ చట్టానికి తెచ్చిన సవరణతో అటవీ ప్రాంతాల్లో కార్పొరేట్లు యథేచ్ఛగా ఏ ప్రాజెక్టునైనా గ్రామ సభల ఆమోదం లేకుండా చేపట్టవచ్చు. 1980 అటవీ చట్టంలో అటవీ భూములను ఇతర అవసరాల కోసం విద్యుత్ ప్రాజెక్టులు, మైనింగ్, బాక్సైట్ తవ్వకాలు లాంటివి గ్రామ సభలు లేకుండా చేపట్టటం కుదరదు. గ్రామ సభల ఆమోదం తప్పనిసరి. ఇప్పుడు ఈ తాజా చట్ట సవరణ ద్వారా గ్రామసభల అవసరాన్ని రద్దు చేస్తోంది. అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్లు అడవుల్లో యథేచ్ఛగా ప్రాజెక్టుల పేరుతో ప్రవేశిస్తే గిరిజనులు తమ భూముల్నుండి గెంటి వేయబడతారు.

ఈ సవరణ మూలంగా కార్పొరేట్లు అడవుల్ని వాణిజ్యపరంగా వినియోగించేందుకు అవకాశం కలుగుతుంది. ప్రయివేటు తోటల పెంపకం, కాఫీ తోటలు పేరుతో దట్టమైన అడవుల్ని ధ్వంసం చేయడానికి వీలు కల్గుతుంది. స్వాతంత్ర్యం వచ్చాక అడవుల పరిరక్షణతో పాటు - అడవుల్లో నివసించే వారికి వారి హక్కులను చట్టబద్ధం చేస్తూ చర్యలు చేపట్టబడ్డాయి. గిరిజనుల భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షణగా ఎన్నో చర్యలు వచ్చాయి. అటవీ ప్రాంతాల్లో ప్రత్యేకంగా గిరిజనుల రక్షణకు ఉద్దేశించి పరిపాలనాపరంగా కూడా కొన్ని చర్యలు చేపట్టబడ్డాయి.

అటవీ చట్టానికి తెచ్చిన సవరణతో అటవీ ప్రాంతాల్లో కార్పొరేట్లు యథేచ్ఛగా ఏ ప్రాజెక్టునైనా గ్రామ సభల ఆమోదం లేకుండా చేపట్టవచ్చు. 1980 అటవీ చట్టంలో అటవీ భూములను ఇతర అవసరాల కోసం విద్యుత్ ప్రాజెక్టులు, మైనింగ్, బాక్సైట్ తవ్వకాలు లాంటివి గ్రామ సభలు లేకుండా చేపట్టటం కుదరదు. గ్రామ సభల ఆమోదం తప్పనిసరి. ఇప్పుడు ఈ తాజా చట్ట సవరణ ద్వారా గ్రామసభల అవసరాన్ని రద్దు చేస్తోంది. అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్లు అడవుల్లో యథేచ్ఛగా ప్రాజెక్టుల పేరుతో ప్రవేశిస్తే గిరిజనులు తమ భూముల్నుండి గెంటి వేయబడతారు.

రక్షణగా చర్యలు

అడవుల్లో బ్రిటీషు పాలకులు గిరిజనుల జీవనానికి ప్రమాదం తెచ్చినప్పుడు 1922 లోనే అల్లూరి సీతారామరాజు ప్రతిఘటన ప్రారంభించాడు. 1924లో రామరాజు కాల్చివేయబడేవరకు అడవుల్లో గిరిజనుల హక్కుల రక్షణ కొరకు ఎన్నో ప్రతిఘటనలు జరిగాయి. ఇదే తీరులో అదిలాబాద్ అడవుల్లో గిరిజనుల కోసం కొమరం భీమ్ పోరాడారు. దేశంలో ఇతర ప్రాంతాల్లోను అడవుల మీద బ్రిటీషువారి దోపిడి, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా వందలాది తిరుగుబాట్లు జరిగాయి. ఈ ఉద్యమాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం రాగానే అనేక రక్షణా చర్యలు తీసుకోబడ్డాయి. కేవలం విద్య ఉపాధి అంశాల్లో రిజర్వేషన్లు ప్రకటించడమే కాదు, అటవీ ప్రాంతాల్లో గిరిజనుల స్వాధీనంలో ఉన్న భూములు అన్యాక్రాంతం కాకుండా రెవిన్యూ చట్టాలలో రక్షణలు కల్పించారు. గిరిజనులకు న్యాయం జరగాలంటే గిరిజన ప్రాంతాల పరిపాలనలోనూ గిరిజనులకే రిజర్వేషన్లు కల్పించి రాజకీయంగానూ చర్యలు తీసుకున్నారు. 1/70 రెగ్యులేషన్స్ జీవో నెం-3 లాంటివి కొన్ని అంశాల్లో గిరిజనులకు రక్షణగా నిలిచాయి. అటవీ హక్కుల చట్టమూ వచ్చింది. అయితే ఇప్పుడు మార్చి 29న ప్రకటించిన సవరణ ప్రకారం ప్రాజెక్టులు చేపట్టడానికి గ్రామసభలు అనుమతులు అవసరం లేదని చెప్పడమే గాదు టూరిజం, మైనింగ్ ఇతర ప్రాజెక్టుల చర్యలు కాంట్రాక్టర్లు, కార్పోరేట్లు అడవుల్ని కొల్లగొట్టడానికి అవకాశం ఇస్తోంది. పార్లమెంటులో ప్రకటించిన వివరాలను బట్టి 2008-09 నాటికే 2.53 లక్షల హెక్టార్ల అడవి ఇతర ప్రాజెక్టుల కోసం మళ్లించబడింది. ఈ నాటి సవరణతో అడవులు ఎక్కువగా ధ్వంసంగావడానికే అవకాశం ఇస్తుంది.

భూస్వాధీనం - హక్కులు

మైదాన ప్రాంతాల్లోనైనా ఏదయినా ప్రాజెక్టు చేపట్టేటప్పుడు భూములు కోల్పోయినవారు దాని ప్రభావంతో జీవనాధారం కోల్పోవడాన్ని అంచనా కట్టాలి. అలాగే పర్యావరణ రక్షణకు జరిగే నష్టాలను అంచనా కట్టాలి. ఇది ఇప్పటికే 1980 అటవీ చట్టంలో రక్షణగా ఉన్న అంశం. ఇప్పుడు ఈ చట్ట సవరణలో ఈ నిబంధనకు మినహాయింపు ఇచ్చారు. ఏ తరహా ప్రాజెక్టులకు అడవుల్లో నిబంధనలు సడలించవచ్చో ఒక జాబితా ప్రకటించారు. విద్యుత్, మైనింగ్, టూరిజం లాంటి అంశాల్ని లిస్టులో పేర్కొన్న అనంతరం అన్ని రకాల వ్యాపార కార్యకలాపాలకు అడవులు కేంద్రం అవుతాయి. గిరిజనుల జీవనాధారం ప్రశ్నార్ధకం అవుతుంది.

ఈ చట్ట సవరణ అడవిని పునర్ నిర్వచనం చేస్తోంది. అడవిలో నివశించే గిరిజనులకున్న హక్కుల్ని విస్మరిస్తోంది. బ్రిటీషువారి 1927 చట్టంలో గిరిజనుల జీవన హక్కులు గుర్తించబడలేదు. అటవీ పరిరక్షణ, పర్యావరణం గురించి ఒక్కమాట కూడా అందులో లేదు. అడవుల్లో చేపట్టే ప్రాజెక్టుల వల్ల భూహక్కులు కోల్పోయే బాధితుల ప్రస్తావనే ఇందులో లేదు. అడవుల రక్షణ కోసం ఇప్పటికే రిజర్వు ఫారెస్టు దాని సమీపంలోని 100 కిలోమీటర్ల వరకు కొన్ని రకాల కార్యకలాపాలకు అవకాశం లేకుండా షరతులు విధించబడ్డాయి, ఇప్పుడు వీటన్నింటినీ తొలగించారు. అడవుల్లో చెట్లు నరికిన చోట మళ్లీ చెట్లు నాటాలన్న నిబంధనకు సడలింపు ప్రకటించారు. అడవుల్లో జంతువుల వేట సఫారీ సాగించడానికి అవకాశం కల్పిస్తున్నారు. ప్రయివేటు పెట్టుబడికి ప్రోత్సాహం పేరుతో ఖనిజ నిక్షేపాల అన్వేషణ, గనుల తవ్వకాలు అనుమతి ఇవ్వబడతాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ చట్ట సవరణ అడవుల్ని ప్రైవేటీకరించడానికి అవకాశం ఇస్తుంది. కొంత భాగం భూముల్లో కలప పెంచడానికి కార్పొరేట్లకు అవకాశం ఇస్తుందని బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టిన సందర్భంలో పత్రికలలో వ్యాఖ్యానాలు వచ్చాయి. అందువల్ల అటు పర్యావరణం, ఇటు గిరిజనుల మనుగడ ఈ సవరణతో ప్రమాదంలో పడుతుంది.

బ్రిటీషువారు రాక ముందు అడవుల మీద, అందులో నివశించే గిరిజనుల జీవనం మీద రాజులు, రాజ్యాలు చొరబాటు గాని, జోక్యం గాని లేదు. అడవుల్లో నివశించే గిరిజన తెగలు తమ జీవనం అడవుల మీద ఆధారపడి వుంది గనుక వాటిని కాపాడ్డానికి కొన్ని కట్టుబాట్లు, రక్షణ చర్యలు చేపట్టి కాపాడారు. వేట సైతం దట్టమైన అడవుల మీద ఆధారపడి వుంది గనుక దట్టమైన అడవుల్ని కాపాడటం తమ బాధ్యతగా గుర్తించి వ్యవహరించారు. అందువల్లే అడవులు దేశంలో ప్రజల సంపదగా చరిత్రకారులు పేర్కొన్నారు. అడవుల మనుగడ, గిరిజనుల జీవనం పెనవేసుకున్న అంశాలుగా పేర్కొని 2006లో అటవీ హక్కుల చట్టం అమల్లోకి వచ్చింది. ఇప్పుడు అది పూర్తిగా రద్దవుతుంది. ప్రజా ప్రతిఘటనే మార్గం.

/వ్యాసకర్త సిపియం కేంద్రకమిటీ మాజీ సభ్యులు /

★

వ్యాఖ్య

కార్పొరేట్ల లాభాల కోసం రైతులకు అన్యాయం!

2023-24 సంవత్సరం ఖరీఫ్ సీజనుకు కనీస మద్దతు ధరలు (ఎంఎస్‌పి)ను మోడీ ప్రభుత్వం ఈ నెల 7వ తేదీన ప్రకటించింది. రైతులు తాము పండించిన పంటలకు సరైన ప్రోత్సాహక ధరలు అందుకునేలా, పంటల్లో వైవిధ్యాన్ని ప్రోత్సహించేందుకు ఈ చర్య తీసుకున్నామని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలు అటు న్యాయంగానూ లేవు, ఇటు ప్రోత్సాహకరంగానూ లేవు. రైతుల ఆశలను దెబ్బతీసేలా, వారి ఆదాయాలకు పెద్ద ఎత్తున నష్టం సంభవించేలా వున్నాయి. రైతులు వివిధ రకాల పంటలు వేసేలా వైవిధ్యతను ప్రోత్సహించడం మాట అటుంచి, అసలు వ్యవసాయంలో రైతులు పెట్టుబడులు పెట్టకుండా వుండేలా నిరుత్సాహాన్ని కలగచేస్తున్నాయి. ప్రధాని నరేంద్ర మోడీ చెప్పినట్లుగా రైతుల ఆదాయాలు రెట్టింపు కావడానికి బదులుగా పెరుగుతున్న ఉపకరణాల వ్యయానికి తోడు అన్యాయంగా వున్న కనీస మద్దతు ధరలతో పెద్ద సంఖ్యలో రైతాంగం ముఖ్యంగా చిన్న, మధ్య తరగతి రైతులు అలాగే కౌలు రైతులు రుణాల ఊబిలో కూరుకుపోతున్నారు. సి2 ప్లస్ 50 శాతం అంటే మొత్తం ఉత్పత్తి వ్యయంలో కనీసం 50 శాతానికి పైగా కనీస మద్దతు ధర ఇవ్వాలని స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సుకు అనుగుణంగా ఎంఎస్‌పిని నిర్ధారిస్తామని ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన హామీకి ద్రోహం చేసేలా వరుసగా 9వ సంవత్సరం కూడా ప్రకటించిన ఎంఎస్‌పి వుంది.

గత సీజనులో క్వింటాల్ ధాన్యానికి రూ.2040 ఇవ్వగా ఈసారి ఎంఎస్‌పి రూ.2183గా నిర్ధారించారు. అంటే కేవలం 7 శాతాన్ని పెంచారు. ముతక తృణధాన్యాలకు కూడా ఎంఎస్‌పిని 6.3 నుండి 7.8 శాతం మధ్య పెంచారు. దీంతో జొన్నలు క్వింటాల్‌కు గతేడాది రూ.2350 వుండగా, ఈసారి రూ.2500 వుంది. మొక్కజొన్నకు కనీస మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.2900 నిర్ణయించారు. ఏడాది క్రితం వీటి ధర రూ.1962 వుంది. అంటే 6.5 శాతం పెరిగింది. కందులు, మినుములు ఎంఎస్‌పి కూడా చాలా స్వల్పంగా వరుసగా 6, 5.3 శాతం పెరిగాయి. అంటే కందులు ధర రూ.400 పెరిగి క్వింటాల్ ధర రూ.7 వేలకు చేరగా, మినుముల ధర రూ.350 పెరిగి, క్వింటాల్‌కు రూ.6950కి చేరింది. ఇకపోతే పత్తి కనీస మద్దతు ధర 8.9 శాతం పెరిగింది. అంటే మీడియం గింజ గల (మీడియం స్టేపుల్) పత్తికి రూ.540 పెరిగి క్వింటాల్ రూ.6080కి చేరింది. పొద్దు తిరుగుడు విత్తనాల ఎంఎస్‌పి 5.6 శాతం పెరిగింది. రూ.60 పెరిగి క్వింటాల్ రూ.6760కి చేరింది. పెసరపప్పు కనీస మద్దతు ధర గతేడాదితో పోలిస్తే 10.4 శాతం పెరిగింది. నువ్వులు ధర 10.3 శాతం పెరగగా, వేరుశనగల ధర గతేడాది కన్నా 9 శాతం పెరిగింది. చాలా పంటలకు ఇదే రీతిలో కనీస మద్దతు ధరలు పెరిగాయి. అయితే, 2019-20 నుండి 2021-22 వరకు ఉత్పత్తి వ్యయ అంచనాల ఆధారంగా వ్యయాన్ని అంచనా వేస్తున్నందున 2021-22 నుండి 2023-24కి పెరిగిన వ్యయ పెంపును భర్తీ చేయడంలో ఎంఎస్‌పి విఫలమవుతోంది.

సాగుకు అయ్యే మొత్తం వ్యయాన్ని లెక్కించే సి2 వ్యయం నుండి స్వంత భూమి అద్దె విలువను, నిర్దిష్ట మొత్తంపై వడ్డీని కలపని ఎ2 ప్లస్ ఎఫ్ఎల్ వ్యయానికి మారిపోయేలా బిజెపి ప్రభుత్వం తన నియమ నిబంధనలను మార్చేసింది. పైగా, ఎ2 ప్లస్ ఎఫ్ఎల్ సూత్రం ప్రకారం లెక్కించిన ధరల్లో కూడా కొంత సంక్లిష్టత లేదా తేడా వుంది. వ్యవసాయ వ్యయం ధరల కమిషన్ (సిఎసిపి) వివిధ రాష్ట్రాల్లో వ్యయాన్ని తక్కువగా అంచనా వేస్తోంది. ఇలా తక్కువగా అంచనా వేసిన వ్యయాల దేశ సగటును ఉపయోగించి ఎంఎస్‌పిని లెక్కిస్తున్నారు. ఖరీఫ్ పంటలకు ధరల విధానాన్ని సిఎసిపి రూపొందించింది. ఆంధ్రప్రదేశ్, బీహార్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, పంజాబ్, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో వరి ఉత్పత్తి వ్యయం అంచనాలు సిఎసిపి అంచనాల కన్నా అధికంగా వున్నాయని 2023-24 సంవత్సరం మార్కెటింగ్ సీజన్ అంగీకరించింది. సిఎసిపి రొటీన్‌గా జరిపే ఈ అంచనాలు, పెరుగుతున్న ఉపకరణాల వ్యయాన్ని లేదా ద్రవ్యోల్బణ కారణాన్ని పరిగణనలోకి తీసుకోవడంలో విఫలమవుతున్నాయి. బిజెపి పాలిత రాష్ట్రాలు చేసిన సిఫార్సులను కూడా కనీసం కేంద్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు.

వరికి సంబంధించినంత వరకు, కేరళ రాష్ట్ర వ్యవసాయ శాఖ వేసిన వ్యయ అంచనా క్వింటాల్‌కు రూ.2847గా వుంది. కానీ సిఎసిపి అంచనా క్వింటాల్‌కు కేవలం 2338 గానే వుంది. పంజాబ్ రాష్ట్రం వేసిన సి2 వ్యయ అంచనా క్వింటాల్‌కు రూ.2089గా వుండగా, సిఎసిపి అంచనాల్లో కేవలం క్వింటాల్‌కు రూ.1462గా మాత్రమే వుంది. చాలా పంటల్లో, సిఎసిపి అంచనాల కన్నా రాష్ట్ర ప్రభుత్వాల అంచనాలు చాలా అధికంగా వుంటున్నాయి. కేరళలో ఉత్పత్తి వ్యయం అధికంగా వుందని, కేంద్రం నిర్ధారించిన ఎంఎస్‌పి ఏ రకంగానూ ఖర్చులన్నింటినీ తట్టుకునేలా లేదని పూర్తిగా తెలిసి ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.800 చొప్పున వరికి బోనస్‌ను ఇస్తూ, క్వింటాల్‌కు రూ.2850 చొప్పున ధాన్యాన్ని సేకరిస్తోంది. కానీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రాలు తీసుకునే ఇటువంటి చొరవలను నిరుత్సాహ పరుస్తోంది. మార్కెట్‌ను వక్రీకరించడమేనని విమర్శిస్తోంది.

సిఎసిపి లెక్కించిన సి2 వ్యయాలు (క్వింటాల్‌కు రూ.1911)ను పరిగణనలోకి తీసుకుని, దానికి సి2 ప్లస్ 50 సూత్రాన్ని వర్తింపచేసినట్టైతే వరి కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2866 వుండాలి. కానీ ప్రకటించిన ఎంఎస్‌పి కేవలం క్వింటాల్‌కు రూ.2183 గానే వుంది. రాష్ట్ర వ్యవసాయ విభాగాలు అందచేసిన సగటు సి2 వ్యయాన్ని (క్వింటాల్‌కు రూ.2139) పరిగణనలోకి తీసుకుంటే సి2 ప్లస్ 50 శాతం అంటే క్వింటాల్‌కు రూ.3208 అవ్వాలి. రెండు కేసుల్లోనూ ప్రకటించిన ఎంఎస్‌పి చాలా తక్కువగానే వుంది. రైతులు వరుసగా క్వింటాల్‌కు రూ.683.5, రూ.1025.5 చొప్పున నష్టపోతారు. ఆంధ్రప్రదేశ్‌లో హెక్టారు సాగులో ఆరు టన్నుల దిగుబడి సాధించే రైతు ఈ వ్యయ లెక్కలతో వరుసగా హెక్టార్‌కు రూ.41,010, రూ.61,530 చొప్పున నష్టపోతాడు. అంటే రాష్ట్రంలో రైతులకు ఒక సీజనుకు రూ.9020 కోట్లు నుండి రూ.13,540 కోట్ల వరకు నష్టం జరుగుతుంది (ఆంధ్రప్రదేశ్‌లో 22 లక్షలకు పైగా హెక్టార్లలో వరి సాగు జరుగుతుంది).

ఇక పత్తి విషయానికి వస్తే, తెలంగాణ రాష్ట్ర సి2 వ్యయ అంచనాలు క్వింటాల్‌కు రూ.11,031గా వున్నాయి. సిఎసిపి అంచనాలు మాత్రం చాలా తక్కువగా క్వింటాల్‌కు రూ.6264గా వున్నాయి. అంటే క్వింటాల్‌కు రూ.4767 తగ్గుతోంది. ఎంఎస్‌పి (క్వింటాల్‌కు రూ.6620)ని, పత్తికి సిఎసిపి సి2 వ్యయ అంచనాలు (క్వింటాల్‌కు రూ.5786)ను పరిగణనలోకి తీసుకుంటే సి2 ప్లస్ 50 శాతం ధర అంటే క్వింటాల్‌కు రూ.8679 వుండాలి. క్వింటాల్‌కు రూ.2059 నష్టం. హెక్టార్‌కు 15 క్వింటాళ్ళ సగటు ఉత్పత్తిని పరిగణనలోకి తీసుకుంటే హెక్టారుకు నష్టం రూ.30,885 వుంటుంది. రాష్ట్ర లెక్కల ప్రకారం సూచించిన ఎంఎస్‌పి సి2 ప్లస్ 50 - క్వింటాల్‌కు రూ.16,547 అంటే కేంద్రం ప్రకటించిన ఎంఎస్‌పి కన్నా క్వింటాల్‌కు రూ.9927 ఎక్కువ. అంటే హెక్టారుకు రూ.1,48,905 మేరకు నష్టం జరుగుతుంది. రాష్ట్రంలో 10 లక్షల హెక్టార్లలో సాగు జరుగుతున్న అంశాన్ని దృష్టిలో పెట్టుకుంటే కేంద్ర ఎంఎస్‌పి, రాష్ట్రం ప్రతిపాదించిన ఎంఎస్‌పిల వద్ద నష్టాలు వరుసగా రూ.5868 కోట్లు, రూ.28291 కోట్లు వుండనున్నాయి. రైతులకు కలిగే నష్టాన్ని, వారిని నిరాశపరచడాన్ని మనం దృష్టిలో పెట్టుకుంటే పత్తి పండించే ప్రాంతాల్లో రైతుల ఆత్మహత్యలు ఎందుకు పెరుగుతున్నాయో బోధపడుతుంది. కందిపప్పుకు కర్ణాటక రాష్ట్రం వేసిన సి2 వ్యయ అంచనాలు క్వింటాల్‌కు రూ.9588గా వున్నాయి. అదే సమయంలో సిఎసిపి అంచనాలు క్వింటాల్‌కు కేవలం రూ.5744గా వున్నాయి. అంటే ఇక్కడ క్వింటాల్‌కు రూ.3844 తగ్గిందన్నమాట. సిఎసిపి సి2 రేట్లతో అంచనా వేసినా కందులు, పెసలు, మినుములు, పొద్దు తిరుగుడు, నువ్వులు, ఒడిశలు (నైజర్ సీడ్స్), పత్తికి సంభవించే నష్టాలు దాదాపు క్వింటాల్‌కు రూ.2 వేలు నుండి రూ.3 వేలు వరకు వుంటాయి. కేంద్రం హామీ ఇచ్చిన రీతిలో ఉత్పత్తి సేకరణ జరగని పక్షంలో రైతులకు ఈ ఎంఎస్‌పి కింద వచ్చే మొత్తం కూడా రాదు. ఈ నేపథ్యంలో రైతులకు సంభవించే నష్టం ఇలా వేలాది కోట్లరూపాయిల్లోనే వుంటుందన్నది ఎవరైనా ఊహించే విషయమే. పత్తి, పప్పుధాన్యాలు, నూనె విత్తనాల విషయంలో కార్పొరేట్ల ఆదేశాల మేరకు తప్పుడు వాణిజ్య విధానాలను అనుసరించడం, జీరో సుంకాలకు దిగుమతి చేసుకోవడం వంటి చర్యలతో రైతన్నలు మరింత సంక్షోభంలోకి నెట్టబడుతున్నారు.

క్షేత్ర స్థాయిలో వాస్తవికంగా నెలకొన్నదాని కంటే చాలా తక్కువగా వ్యయాన్ని తక్కువ అంచనా వేయడం ద్వారా రైతులు మొదటగా మోసపోతున్నారు. దేశ సగటు వ్యయ అంచనాలు వాటి వాస్తవిక వ్యయాల కన్నా తక్కువగానే వుండడం వల్ల అధిక ఉత్పత్తి వ్యయం గల రాష్ట్రాల్లో రైతులు రెండోసారి మోసపోతున్నారు. ఇక చాలా కేసుల్లో హామీ ఇచ్చిన రీతిలో ప్రభుత్వం సేకరించదు గనుక ఈ ఎంఎస్‌పి చాలావరకు కేవలం కాగితాలకే పరిమితమవు తుండడంతో మూడోసారి రైతులు మోసపోతున్నారు. 2021-22లో మొత్తం రైతులు ఉత్పత్తి చేసిన దాంట్లో కేంద్రం సేకరించింది, తుర్ దాల్‌కు సంబంధించి 1.14 శాతం వుండగా, పెసలకు 5.07శాతంగా వుంది. మినుములను కేవలం 0.21శాతమే సేకరించారు, వేరుశనగలను 2.05 శాతం సేకరించగా, సోయాబీన్ ఉత్పత్తులను అసలు సేకరించనే లేదు. 2022-23 సంవత్సరానికి చూసినట్టైతే ఫిబ్రవరి 28నాటికి వున్న లెక్కల ప్రకారం, కందులు, మినుములు, సోయాబీన్‌లను అసలు సేకరించలేదు. కేవలం పెసలను రూ.6.39 శాతం సేకరించారు.

ఇలా రైతులు ఒకపక్క వారి ఉత్పత్తులకు సరైన ధరలు రాకపోవడం, మరోపక్క ప్రభుత్వ నియంత్రణ లేకుండానే ధరలను నిర్ణయించడంలో కార్పొరేట్ కంపెనీలకు స్వేచ్ఛ ఇచ్చిన కారణంగా ఉపకరణాల వ్యయం పెరుగుతూ పోవడంతో అడ కత్తెరలో పోక చెక్కలా నలిగిపోతున్నారు. ఎంఎస్‌పిని పెంచితే వినియోగదారులకు ధరలు పెరుగుతాయనేది తరచుగా చెప్పే ప్రభుత్వం చెప్పే సాకుగా వుంటుంది. కానీ, రైతులు, వినియోగదారులను పణంగా పెట్టి లాభాలు దండుకోవడాన్ని నిలువరించేందుకు ఏమీ జరగడం లేదు.

మరింత మెరుగైన, ఆర్థికంగా లాభసాటిగా వుండే వ్యవసాయ పద్ధతులు, విధానాలతో ఉత్పాదకతను పెంచుకోవాలని, అధిక దిగుబడినిచ్చే రకాలను ఉపయోగించాలని, అందుబాటు ధరల్లో, సబ్సిడీ రేట్లకు నాణ్యత గల ఉపకరణాలు అందించాల్సిన అవసరం వుందన్నది తిరుగులేని వాస్తవం. అందులో ఎలాంటి సందేహం లేదు. రైతులకు శాస్త్రీయ అభివృద్ధి ఫలాలను చేరవేసేందుకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతుల విస్తరణ, వ్యాప్తి జరగాల్సిన అవసరం కూడా వుంది. అయితే, నరేంద్ర మోడీ ప్రభుత్వానికి ఇది ప్రాధాన్యంగా లేదు. రైతులకు నష్టాలను కలిగిస్తూ, వారిని రుణాల ఊబిలోకి ఉద్దేశ్యపూర్వకంగా నెట్టివేసే, మరింత పేదలను చేసే, వారి భూమికి వారిని దూరం చేసే పద్ధతులకు, విధానాలకు పాల్పడుతూ ఆ దిశగా బిజెపి ప్రభుత్వం పయనిస్తోంది. మరోపక్క కార్పొరేట్ కంపెనీల ఖజానాలు నింపుతూ వారికి గరిష్ట స్థాయిలో లాభాలు ఆర్జించి పెడుతోంది. గతంలో కేంద్రం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు, విద్యుత్ చట్టానికి సవరణలు ఇవన్నీ కూడా రైతులను సాగు నుండి దూరంగా నెట్టివేసే ఎత్తుగడలో భాగమే. ఈ నేపథ్యంలో, చట్టబద్ధమైన కనీస మద్దతు ధరలతో పాటూ సేకరణ హామీ కల్పించేలా సమైక్య పోరాటాలు జరపడమన్నది అత్యంత కాలానుగుణ్యమైన అంశం. ఈ పోరాటాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

మోడీ కనబడుట లేదు

- ప్రధానికి వ్యతిరేకంగా మణిపూర్‌లో పోస్టర్లు
- ఇంకా చల్లారని ఈశాన్య రాష్ట్రం
- ఆయన మౌనంపై నిరసనకారుల ఆగ్రహం
- ఇంఫాల్‌లో హింసాత్మక వాతావరణం
- అనేక ఇళ్లకు నిప్పు పెట్టిన అల్లరి మూక



ఇంఫాల్‌ : ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో చోటు చేసుకుంటున్న హింసాత్మక ఘటనలపై మోడీ మౌనం అక్కడి ప్రజలు, ఆందోళనకారుల్లో తీవ్ర ఆగ్రహాన్ని తెప్పిస్తున్నది. రాష్ట్రంలో ఇంత జరిగినా ఆయన నోటి నుంచి ఒక్క మాట కూడా రాకపోవటం వారి కోపానికి కారణమవుతున్నది. ఇందులో భాగంగా మోడీ కనబడుట లేదంటూ ఆందోళనకారులు మణిపూర్‌లో మోడీకి వ్యతిరేకంగా పోస్టర్లు, ఫ్లకార్డులు ప్రదర్శించారు. 'ఈయనను(మోడీ) మీరు చూశారా?' అని మోడీ పేరు ఆయన చిత్రంతో ఉన్న పోస్టర్లు రాష్ట్రంలో దర్శనమిస్తున్నాయి. ఆయన ఎత్తు ఐదు అంగుళాల ఆరు అంగుళాలనీ, ఛాతీ 56 ఇంచులు అని ఆ పోస్టర్లలో రాసి ఉన్నది. అంధుడు, చెవిటి వాడని, ఆయనను చివరిసారి మణిపూర్ ఎన్నికల ర్యాలీలో చూశామని అందులో పేర్కొన్నారు. మణిపూర్‌ విషయంలో మోడీ ఇప్పటికీ మౌనంగానే ఎందుకున్నారని కుకీ, మెయితీ వర్గాలకు చెందిన విద్యార్థులు, స్కాలర్లు ప్రశ్నిస్తున్నారు. ఇటు ప్రతిపక్ష కాంగ్రెస్‌ సైతం మోడీ తీరును తప్పుబడుతున్నది. ప్రధాని తన మౌనాన్ని వీడాలనీ, రాష్ట్రంలో శాంతికి పిలుపునివ్వాలని సూచించింది. సామాజిక కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు సైతం మోడీ మౌనాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నారు. ప్రధాని మౌనానికి రాష్ట్ర ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో అల్లర్ల వేడి ఏ మాత్రం చల్లారటం లేదు. అక్కడ అవే ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి కాంగ్పోక్పి జిల్లాలో కాల్పులు చోటు చేసుకోవటం, ఇండ్లకు నిప్పు పెట్టటం వంటి ఘటనలతో తొమ్మిది మంది తమ ప్రాణాలను కోల్పోయిన విషయం తెలిసిందే. ఇది జరిగి ఒక రోజు గడవక ముందే ఇంఫాల్‌లో మళ్లీ హింసాత్మక పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనకారులు అనేక ఇండ్లకు నిప్పు పెట్టటంతో అక్కడ భయానక వాతావరణం ఏర్పడింది. అయితే, అల్లరి మూకను చెదరగొట్టటానికి పోలీసులు టియర్ గ్యాస్ షెల్లను ప్రయోగించారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో హింసాత్మక పరిస్థితులు కొనసాగుతుండటంతో కేంద్ర బలగాలైన ఆర్మీ, అస్సాం రైఫిల్స్ రంగంలోకి దిగాయి. అయినప్పటికీ రాష్ట్రంలో హింస తగ్గుముఖం పట్టకపోవటం గమనార్హం.

దాదాపు నెల క్రితం మొదలైన అల్లర్లు ఇప్పటికీ కొనసాగుతుండటంతో మణిపూర్‌లోని బీజేపీ సర్కారు వైఫల్యాలపై సామాజికవేత్తలు, ప్రజా సంఘాల నాయకులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇటు కేంద్రంలోని మోడీ సర్కారు సైతం అల్లర్లను కట్టడి చేయటంలో విఫలమైందని ఆరోపించారు. స్వయంగా కేంద్ర హోం శాఖ మంత్రి రంగంలోకి దిగి రాష్ట్రంలో పర్యటించినా పరిస్థితులు అదుపులోకి రాకపోవటం మోడీ సర్కారు అచేతన స్థితికి నిదర్శనమన్నారు. కాగా మణిపూర్ అంశం అమిత్ షాకు తీవ్ర తల నొప్పిగా పరిణమించిందని రాజకీయ విశ్లేషకులు తెలిపారు. ఎస్టీ హోదా కల్పించాలన్న డిమాండ్‌పై మెయితీ, కుకీ వర్గాల మధ్య వివాదం చెలరేగి అది ప్రస్తుత హింసాత్మక పరిస్థితులకు దారి తీసిన విషయం విదితమే.

రాష్ట్రంలో చోటు చేసుకున్న ఉద్రిక్త పరిస్థితులు అధికార బీజేపీకి ఊపిరి ఆడనివ్వటం లేదు. ముఖ్యంగా ఆ పార్టీకి చెందిన నాయకులకు ఆందోళనకారుల నుంచి ప్రతిఘటనలు ఎదురవుతున్నాయి. బుధవారం చోటు చేసుకున్న హింసలో ఇంఫాల్‌లోని ఆ రాష్ట్ర మంత్రి నెమ్చా కిప్గెన్ అధికార నివాసానికి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. భద్రతా బలగాల నుంచి తప్పించిన ఆయుధాలను తిరిగి ఇచ్చేయాలంటూ మణిపూర్ మంత్రి లీషాన్గ్మ్ సుసింద్రో మెయితీ తన ఇంటి బయట ఒక డ్రాప్ బాక్స్‌ను ఉంచారు.

వందేభారత్...ప్రయాణం బహుపరాక్!

- తప్పని ధరాభారం
- నిత్యం ఆలస్యం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

'రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలకు రెండు వందేభారత్ రైళ్లు ఇచ్చాం' అంటూ ఆ రైళ్ల గురించి విశాఖకు ఇటీవల విచ్చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా గొప్పలకు పోయిన సంగతి తెలిసిందే. వాస్తవానికి ఈ రైళ్లు సకాలంలో నడుస్తున్నాయా? అంటే లేదనే సమాధానమే వినిపిస్తోంది. ప్రతిరోజూ విశాఖ - సికింద్రాబాద్ - విశాఖ మధ్య అటూ, ఇటూ రాకపోకలు సాగించే ఈ రైలు సకాలంలో బయల్దేరుతుందో? లేదో? అనే అందోళన నానాటికీ తీవ్రమవుతోంది. నిరంతర ఆలస్యంతోనే ఈ రైలు ప్రయాణిస్తోందని ప్రయాణికులు చెబుతున్నారు. మొదట్లో ఈ రైలు అద్దాలపై రాళ్లు రువ్విన ఘటనలతో ప్రయాణాలపై నీలినీడలు అలముకున్నాయి. తాజాగా ఎక్కడో ఒకచోట మిగతా ట్రాక్‌ల పరిస్థితి సరిగ్గా లేనందున వందేభారత్‌పై ప్రభావం పడుతోంది. కనీసం నాలుగు గంటలు ఆలస్యం కావడం పరిపాటిగా మారింది. సరైన నిర్వహణలేమి, నానాటికీ తీసికట్టుగా ఉండే మన రైల్వే ట్రాక్‌లపై 150 కిలోమీటర్ల పైబడి వేగంగా ప్రయాణించే రైళ్లతో ఎన్ని సమస్యలన్నవి వందేభారత్ వచ్చాక మరింతగా వెల్లడవుతోంది. రైళ్లకు గొప్పగా నామకరణం చేసినా క్షేత్రస్థాయిలో ప్రయాణం సజావుగా సాగడం లేదు. వందేభారత్ రైలు ఛార్జీ విశాఖ నుంచి సికింద్రాబాద్‌కు భోజనంతో కలిపి సిసి క్లాస్‌లో రూ. 1356 కాగా, ఎగ్జిక్యూటివ్ క్లాస్‌లో రూ. 3170 వరకు ఉంది.

విశాఖ నుంచి 4 గంటలు, హైదరాబాద్ నుంచి 5 గంటల ఆలస్యం

ఈ నెల 15న విశాఖ నుంచి హైదరాబాద్‌కు ఉదయం 5.45 గంటలకు బయల్దేరాల్సిన వందేభారత్ రైలు నాలుగు గంటలు ఆలస్యంగా బయల్దేరింది. హైదరాబాద్‌లో మధ్యాహ్నం మూడు గంటలకు బయల్దేరాల్సిన ఈ రైలు ఐదు గంటలు ఆలస్యంగా అంటే గురువారం రాత్రి 8 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరింది. ఈ నెల 16న కూడా విశాఖ నుంచి ఉదయం బయల్దేరాల్సిన ఈ రైలు 9.45 గంటలకు మార్చబడింది. ప్రతిసారీ ఈ రైలు టైమింగ్స్‌ను రీ షెడ్యూల్ చేసేందుకే వాల్తేరు డిఆర్‌ఎం కార్యాలయంలో సిబ్బంది అధిక సమయం వెచ్చిస్తున్నారన్నది స్పష్టమవుతోంది. విశాఖపట్నం వద్ద తాడి-అనకాపల్లి మధ్య బుధవారం దెబ్బతిన్న రైలు పట్టాలను సరిచేసే పనిలో సాంకేతిక నిపుణులు ఉన్నట్టు రైల్వే అధికారులు చెబుతున్నారు. ట్రాక్‌ల భద్రతపై రైల్వే శాఖకు ఆసక్తి లేదని, కేవలం కార్యాలయాల్లో తనిఖీలకే సేఫ్టీ బృందాలు వచ్చిపోతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వందేభారత్ రైలు ఆలస్యం అయ్యాక కూడా తూర్పు కోస్తా రైల్వే ప్రధాన కార్యాలయం భువనేశ్వర్ నుంచి ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ పిసి సాహూ నేతృత్వంలోని బృందం గురువారం సాయంత్రం విశాఖ డిఆర్‌ఎం కార్యాలయంలో తనిఖీలు చేసింది. ఆపరేషన్లను పరిశీలన చేసి డైరెక్షన్స్ ఇచ్చింది.

జీ 20 దేశాలతో కలిసి పని చేసేందుకు భారత్ సిద్ధం

- వ్యవసాయ మంత్రుల సమావేశంలో తోమర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయంలోని వివిధ రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లకు పరిష్కారాలను కనుగొనేందుకు జీ 20 దేశాలతో కలిసి పని చేసేందుకు భారతదేశం సిద్ధంగా ఉందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని హెచ్‌ఐసిసి నోవాటెల్‌లో నిర్వహించిన జీ20-వ్యవసాయ మంత్రుల సమావేశానంతరం తోమర్ మాట్లాడారు. వ్యవసాయ రంగంలో భారతదేశం ఎదుర్కొంటున్న సవాళ్లకు పరిష్కారాలను కనుగొంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు ఎక్కువ ఆదాయాన్ని పొందేందుకు, నష్టాలను తగ్గించేందుకు ప్రభుత్వం పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహిస్తోందని చెప్పారు. పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో అనేక కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. రాబోయే సంవత్సరాల్లో దేశవ్యాప్తంగానూ రైతులు ఈ మార్పులను స్వీకరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామని, వీటి అమలు కోసం ఇప్పటివరకు రూ.1500 కోట్లు ఖర్చు చేశామన్నారు. వాతావరణ మార్పుల వల్ల జరిగే పంట నష్టాలను తగ్గించేందుకు భారతదేశం వాతావరణాన్ని తట్టుకునే విత్తనాలను అభివృద్ధి చేస్తోందని చెప్పారు. ఇలాంటి వాతావరణ మార్పు సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్న ఇతర దేశాలకూ ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. శుక్రవారం ఆహార భద్రత, పోషకాహారం, డిజిటల్ టెక్నాలజీలు, వ్యవసాయ వ్యాపారం, వాతావరణ మార్పులు, సుస్థిర వ్యవసాయం మొదలైన అంశాలకు సంబంధించిన ఎజెండాపై చర్చ జరగనుందని చెప్పారు. జూన్17న జీ 20 వ్యవసాయ మంత్రులు వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రకటనతోపాటు రోడ్ మ్యాప్‌ను విడుదల చేస్తారని తెలిపారు.

తుమ్మలపల్లి ప్రసాద్‌కు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు

(మొదటి పేజీ తరువాయి)

కె రామచంద్రమూర్తితో ప్రారంభించి తరువాత అనేక మంది జర్నలిస్టుల ప్రతిభావంతమైన కథనాలకు ఈ పురస్కారం లభించింది. ఈ ఏడాది అవార్డు కోసం క్షేత్ర స్థాయి వార్తా కథనాలను, ఫీచర్స్‌ను ఆహ్వానించగా, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి మంచి స్పందన లభించింది.

సీనియర్ సంపాదకులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన అవార్డు ఎంపిక కమిటీ ఈ నెల 13న సమావేశమై వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించింది. ఎంట్రీలు వైవిధ్యభరితంగాను, హృద్యంగాను, వాస్తవ పరిస్థితులకు దర్పణం పట్టేవిగాను ఉన్నాయని కమిటీ సంతృప్తి వ్యక్తం చేసింది. పాల్గొన్నవారికి ఆయా పత్రికలకూ ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. ఈ నెల 20న పుట్టపర్తిలో జరిగే సభలో అవార్డు ప్రదానం చేయనున్నట్లు ప్రజాశక్తి సాహితీ సంస్థ కార్యదర్శి ఎంవిఎస్ శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

మత మార్పిడి నిరోధక చట్టం రద్దు

(మొదటి పేజీ తరువాయి)

బలవంతంగా, ఆకర్షణతోనూ, మోసపూరితంగానూ లేదా వివాహం ద్వారానూ మత మార్పిడిని నిరోధించడానికి ఈ చట్టం తీసుకొచ్చినట్లు బొమ్మై ప్రభుత్వం అప్పట్లో తెలిపింది. '2022లో బిజెపి తీసుకొచ్చిన ఈ చట్టం రద్దవుతుంది. మేం తీసుకొచ్చే బిల్లు రాజ్యాంగానికి లోబడి ఉంటుంది' అని కర్ణాటక న్యాయశాఖ మంత్రి హెచ్‌కె పాటిల్ గురువారం తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా కాంగ్రెస్ ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ బిల్లు ప్రజలకు, పేదలకు వ్యతిరేకమని, అమానవీయ మైనదని, రాజ్యాంగ వ్యతిరేకమని, కఠినమైనదని కాంగ్రెస్, జెడి(ఎస్), ఇతర ప్రతిపక్షాలు విమర్శించాయి. బిల్లును ఆమోదించవద్దని కోరాయి. బిజెపి ఈ బిల్లు పేరుతో మైనారిటీలపై కక్షసాధింపులో భాగంగా అనేక నిబంధనలు పెట్టింది. చట్టాన్ని అతిక్రమిస్తే రూ.50 వేల జరిమానాతో మూడు నుంచి ఐదేళ్ల వరకూ శిక్ష విధించేలా నిబంధనలు చేర్చగా, తాజాగా సిద్ధరామయ్య సర్కారు ఈ చట్టాన్ని రద్దు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో రాజ్యాంగ పీఠికను చదవడం తప్పనిసరి చేసింది. ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకుడు కెబి హెడ్గేవార్ పాఠాన్ని పాఠ్యాంశాల నుంచి తొలగించాలని కేబినెట్ నిర్ణయించింది. దీంతోపాటు బిజెపి ప్రభుత్వం గతంలో సిలబస్‌లో లౌకిక విధానాలకు తూట్లు పొడుస్తూ చేసిన మార్పులన్నింటినీ రద్దు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది.

పబ్లిక్ నోటీసు

ICICI Bank

రిజిష్టర్డ్ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, ల్యాండ్ మార్క్, రేస్ కోర్స్ సర్కిల్, వడోదర-390007
కార్పోరేట్ ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్), ముంబై-400051

బ్రాంచ్ ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ వీధి నం.1, బేగంపేట, హైదరాబాద్ సిటి, తెలంగాణ రాష్ట్రం, పిన్-500016

దిగువ రుణగ్రహీత/లు బ్యాంక్ నుండి వారి ద్వారా రుణాల సౌకర్యాలు అసలు మరియు వడ్డీ తిరిగిచెల్లించుటలో విఫలమైనారు మరియు రుణాలు నాన్-ఫర్‌ఫార్మింగ్ అస్సెట్స్ (ఎన్‌పిఏ) గా వర్గీకరించబడినాయి. వారి చివరిగా తెలిసిన చిరునామాల మీద సెక్షన్ 13 (2) యొక్క సెక్యూరిటీజైషన్ అండ్ రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్-2002 క్రింద నోటీసు జారీచేయబడింది, అయినప్పటికీ ఇది తీసుకొనబడలేదు మరియు కావునా పబ్లిక్ నోటీసు ద్వారా వారు ఇక్కడ గమనించవలసిందిగా కోరుతున్నాము.

క్ర. సం.	రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/హామీదారుడు/ (లోను ఖాతా నంబర్) & చిరునామా	అమలుచేయబడిన సెక్యూర్డ్ అస్సెట్ వివరణ	పంపబడిన నోటీసు తేది/నోటీసు తేది నాటికి బకాయిలు	ఎన్‌పిఏ తేది
1.	UQVJW00041924269/ మహమ్మదాలీ షేక్/ 40 1 139 5 షా మంజిల్ మొహిద్దీన్ స్ట్రీట్/ లబ్బీపేట్ అష్రాఫ్ మెటర్నిటీ హాస్పిటల్ దగ్గర/ విజయవాడ వేంకటేశ్వరపురం కృష్ణా/విజయవాడ- 520010	ECLGS/ ECLGS/ ECLGS	15-Apr-23 Rs. 13,21,282/-	31-07-2021
ఒకవేళ పై పేర్కొన్న వ్యక్తులైన మీరు ఈ నోటీసు తేది నుండి 60 రోజుల్లోగా షార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద ఈ నోటీసు యొక్క నియమాలలో పైన చూపినట్లుగా తదుపరి వడ్డీ మరియు ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులుతో మీచేత బకాయిపడిన పై పేర్కొన్న మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందినయో, బ్యాంకు, షార్ఫసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(4) క్రింద మరియు సదరు చట్టం యొక్క ఇతర వర్తించు నియమాలు అనుసరించి అన్ని లేదా ఏవేని అధికారాలను వినియోగిస్తుంది. చట్టం యొక్క ఏవేని ఇతర నియమాల క్రింద ఇది అవసరమైనట్లుగా అట్టి ఇతర చర్యలు లేదా చట్టపరమైన చర్యలు ప్రారంభించుటకు బ్యాంకుకుగల అధికారాలతో పక్షపాతంలేకుండా ఈ ప్రకటన జారీచేయబడినది.

తేది: 15.06.2023, ప్రదేశం: హైదరాబాద్ **సం/- అధీకృత అధికారి, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్**

అమెరికాతో సాయుధ డ్రోన్ల ఒప్పందానికి డిఎసి ఆమోదం

న్యూఢిల్లీ : అమెరికాతో సుమారు మూడు బిలియన్ డాలర్ల విలువ కలిగిన సాయుధ డ్రోన్ల కొనుగోలు ఒప్పందానికి డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డిఎసి) గురువారం ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందానికి కేంద్ర కేబినెట్ తుది ఆమోదం తెలపాల్సి ఉంది. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన గురువారం ఉదయం డిఎసి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సుదీర్ఘకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న అమెరికా జనరల్ అటోమిక్స్‌తో సాయుధ ప్రిడేటర్ అన్‌మ్యాన్డ్ ఏరియల్ వెహికల్స్ (యుఎవి) కొనుగోలు ఒప్పందాన్ని ఆమోదించింది. ఈ ఒప్పందం ప్రకారం అంచనా వ్యయం సుమారు 3 బిలియన్ డాలర్లతో 30 సాయుధ డ్రోన్లను కొనుగోలు చేయనున్నారు. ఇందులో 14 డ్రోన్లను నావికాదళానికి కేటాయిస్తారు. మిగిలినవి ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌కు కేటాయిస్తారు. ఒప్పందంలో కొనుగోలుతోపాటు నిర్వహణ, ఓవర్‌హాల్, మరమ్మతులు కూడా ఉన్నాయని అధికారులు చెప్పారు. నావికాదళం, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌లకు ఒక్కొక్కదానికి 10 డ్రోన్ల చొప్పున కొనుగోలు చేయాలని భావించినా.. నావికాదళానికి ఎక్కువ అవసరం ఉండటంతో 14 డ్రోన్లను కేటాయించారు. ఈ ఒప్పందానికి డిఎసి ఆమోదం లభించడంతో వచ్చే వారంలో మోడీ అమెరికా పర్యటనలో దీనిని ప్రకటించే అవకాశం ఉంది. ఈ నెల 22న అమెరికాలో మోడీ పర్యటిస్తున్న సంగతి తెలిసిందే.

సౌత్ ఈస్టర్న్ రైల్వే ఎజిఎం బదిలీ

చెన్నై : ఒడిషాలో 288 మంది మరణించిన ఘోర రైలు ప్రమాదం జరిగిన రెండు వారాల తరువాత సౌత్ ఈస్టర్న్ రైల్వే అడిషనల్ జనరల్ మేనేజర్ (ఎజిఎం) అతుల్య సిన్హాను బదిలీ చేశారు. సిన్హాను పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ బర్ధ్మాన్ జిల్లాలో ఉన్న చిత్తరంజన్ లోకోమోటివ్ వర్క్స్ ప్రిన్సిపాల్ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ పదవికి గురువారం బదిలీ చేశారు. ఇది పదవీ పరంగా ఉన్నతమైనప్పటికీ డౌన్‌గ్రేడ్‌గానే భావిస్తారు. సిన్హా బదిలీకి కారణం చెప్పకపోయినా, రాష్ట్రపతి ఆమోదంతోనే ఈ బదిలీ జరిగినట్లు రైల్వే బోర్డు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. సౌత్ ఈస్టర్న్ రైల్వే నూతన ఎజిఎంగా ఈస్టర్న్ రైల్వే ప్రిన్సిపాల్ చీఫ్ ఇంజనీర్ ఎకె దుబేను నియమించారు. ఈ నెల 2న ఒడిషాలోని బాలాసోర్ జిల్లాలో మూడు రైళ్లు ఢీకొన్న ప్రమాదం జరిగిన తరువాత ఇదే పెద్ద బదిలీగా భావిస్తున్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెబాట

- కమిషనరుకు నోటీసు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సమ్మెబాట పట్టనుంది. ఈ మేరకు గురువారం కుటుంబ ఆరోగ్య సంక్షేమశాఖ కమిషనరుకు నేషనల్ హెల్త్ మిషన్ జెఎసి తరుపున సమ్మె నోటీసు ఇచ్చారు. దీనిపై జెఎసి ఛైర్మన్ దయామణి మాట్లాడుతూ.. డిపిహెచ్, ఎపివివిపి, డిఎంఇలలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అమలు చేస్తున్న మినిమం టైమ్‌స్కేల్ నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు అమలు చేయడం లేదని తెలిపారు. దీనిపై ఒంగోలులో జరిగిన జెఎసి సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఆగస్టు ఒకటోతేదీ నుంచి విధులు బహిష్కరించి ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతామని తెలిపారు. ఈలోపు జులై 10న సామూహికంగా జగనన్నకు చెబుదాం పేరుతో తాడేపల్లిలో కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. దీనికి ఉద్యోగులందరూ సిద్ధంగా ఉన్నారని దయామణి వివరించారు.

పొగడటంలో తప్పులేదు

ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖరరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగులకు మేలు చేస్తే సిఎంను పొగడటంలో తప్పులేదని ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖరరెడ్డి తెలిపారు. వెలగపూడి సచివాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్యోగులకు సంబంధించిన అనేక అంశాలను సిఎం పరిష్కరించారని తెలిపారు. ఇలాంటి సమయంలో ఉద్యోగ సంఘాల నాయకులు ఆయన్ను కలిసి అభినందించడంలో తప్పులేదని అన్నారు. రాజకీయ పార్టీలు చెప్పినట్లు ఉద్యోగ సంఘాలు నడుచుకోవని అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని టిడిపి మ్యానిఫెస్టోలో పెట్టారని, దీనిపై చంద్రబాబును అడిగితే తాము పెట్టలేదని తెలిపారన్నారు. అడగకుండానే జగన్‌మోహన్‌రెడ్డి కొత్త పిఆర్‌సి వేశారన్నారు. 12వ పిఆర్‌సి కమిషన్ వేస్తామని చెప్పడం అభినందనీయమని అన్నారు. ఉద్యోగుల బకాయిలను సెప్టెంబరు నాటికి క్లియర్ చేస్తామని సిఎం హామీనిచ్చారని పేర్కొన్నారు.

ఎపి పిజిఇ సెట్ ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

మండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి పాల్గొనగా, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో వైస్ ఛాన్సలర్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

టాప్ టెన్ ర్యాంకర్లు వీరే

ఎపి ఐసెట్‌లో తిరుపతి జిల్లాకు చెందిన అల్లికేశం గ్రామానికి చెందిన తపాలా జగదీశ్ కుమార్‌రెడ్డి మొదటి ర్యాంకు సాధించారు. ద్వితీయ ర్యాంకు వేదాంతం సాయి వెంకట కార్తిక్ (సికింద్రాబాద్), తృతీయ ర్యాంకు పుట్లూరు రోహిత్ (అనంతపురం), నాలుగో ర్యాంకు చింత జ్యోతి స్వరూప్ (విజయనగరం), ఐదవ ర్యాంకు కునూరి రేవంత్ (విశాఖపట్నం), ఆరవ ర్యాంకు మహ్మద్ ఆఫ్తబ్ బుడేన్ (పశ్చిమ గోదావరి), ఏడవ ర్యాంకు దేవరపల్లి దేవ అభిషేక్ (విశాఖపట్నం), ఎనిమిదవ ర్యాంకు జమ్ము ఫణీంద్ర (కాకినాడ), తొమ్మిదవ ర్యాంకు పరితి రోహన్ (బాపట్ల), పదవ ర్యాంకు అంబల్ల మహాలక్ష్మి (పశ్చిమ గోదావరి) సాధించారు.

పాఠ్యాంశాల తొలగింపుతో

ప్రమాదంలో సృజనాత్మకత

- మా పేర్లు తొలగించండి
- ఎన్‌సిఇఆర్‌టికి 33 మంది విద్యావేత్తలు లేఖ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పాఠ్యాంశాలు తొలగించిన పాఠ్యపుస్తకాల నుంచి తమ పేర్లను తొలగించాలని మరో 33 మంది విద్యావేత్తలు ఎన్‌సిఇఆర్‌టిని కోరారు. ఇప్పటికే ఇద్దరు మాజీ ఎన్‌సిఇఆర్‌టి సలహాదారులు యోగేంద్ర యాదవ్, సుహాస్ పల్షికర్ పొలిటికల్ సైన్స్ పాఠ్యపుస్తకాల నుంచి తమ పేర్లను తొలగించాలని కోరారు. ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టరు దినేష్ ప్రసాద్ సక్లానీకి లేఖ రాసిన వారిలో అశోక విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్, రాజకీయ శాస్త్రవేత్త ప్రతాప్ భాను మెహతా, ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన రాధికా మీనన్, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నివేదిత మీనన్, కాంతి ప్రసాద్ బాజ్‌పాయ్, నేషనల్ యూనివర్సిటీ సింగపూర్ వైస్-డీన్, జెఎన్‌యు మాజీ ప్రొఫెసర్ రాజీవ్ భార్గవ తదితరులు ఉన్నారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సిఇఆర్‌టి) పాఠ్యపుస్తకాల్లో మార్పుపై ఆందోళన వ్యక్తం చేస్తూ పాఠ్యపుస్తకాల అభివృద్ధి కమిటీలో భాగమైన 33 మంది విద్యావేత్తలు తమ పేర్లను ప్రస్తుత పాఠ్యపుస్తకాల నుంచి తొలగించాలని కౌన్సిల్‌ను కోరారు. నేషనల్ కరికులం ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సిఎఫ్) 2005 వెర్షన్ ఆధారంగా 2006-07లో రూపొందించిన పుస్తకాల కోసం పాఠ్యపుస్తకాల అభివృద్ధి కమిటీలో సభ్యులుగా ఉన్న 33 మంది రాజకీయ శాస్త్రవేత్తలు, ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యాంశాల తొలగింపు 'సృజనాత్మక సామూహిక ప్రయత్నాన్ని ప్రమాదంలో పడేసింది' అని పేర్కొన్నారు.

'ఎన్‌సిఇఆర్‌టి ఇప్పుడు పాఠ్యపుస్తకాల్లో మార్పులు చేస్తోంది. కొన్ని విభాగాలను (చాప్టర్లు కూడా) తీసివేయడం, ఇతరులకు ప్రాధాన్యత ఇవ్వడం వంటివి ఉన్నాయి. ఏది ఆమోదయోగ్యం కాదో, ఏది కావాలో నిర్ణయించేది ఎవరు అనే నిర్ణయం పారదర్శకంగా లేదు. పారదర్శకత, పోటీ ప్రధాన సూత్రాలను ఉల్లంఘించాయి. విద్యా విషయక జ్ఞాన ఉత్పత్తికి ఆధారమని మేము విశ్వసిస్తున్నాము' అని పేర్కొన్నారు. 'అసలు పాఠ్యపుస్తకాల్లో అనేక ముఖ్యమైన పునర్విమర్శలు ఉన్నందున, వాటిని వివిధ పుస్తకాలుగా రూపొందిస్తున్నందున, ఇవి మేము తయారుచేసిన పుస్తకాలు అని చెప్పుకోవడం, వాటితో మా పేర్లను అనుబంధించడం మాకు కష్టంగా ఉంది' అని విద్యావేత్తలు తెలిపారు. 'ఈ సృజనాత్మక సమిష్టి కృషి ప్రమాదంలో పడిందని మేము విశ్వసిస్తున్నాము. ఈ మార్పు పట్ల చాలా విచారం వ్యక్తం చేస్తూ, ఎన్‌సిఇఆర్‌టి రాజకీయ శాస్త్ర పాఠ్యపుస్తకాల నుంచి పాఠ్యపుస్తక అభివృద్ధి కమిటీ సభ్యులుగా మా పేర్లను తొలగించాలని మేము మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాము' అని లేఖలో పేర్కొన్నారు. 33 మంది విద్యావేత్తలు తమ లేఖలో వివిధ కోణాలు, సైద్ధాంతిక నేపథ్యాల నుంచి రాజకీయ శాస్త్రవేత్తల మధ్య విస్తృతమైన చర్చలు, సహకారాల ఫలితంగా పాఠ్యపుస్తకాలు వచ్చాయని, భారతదేశ స్వాతంత్ర్య పోరాట ఆదర్శాలు, రాజ్యాంగ సభ ఆకాంక్షలు, సూత్రాల గురించి జ్ఞానాన్ని వ్యాప్తి చేయడానికి ఉద్దేశించబడ్డాయని అన్నారు. మన రాజ్యాంగ క్రమం, నాయకులు, ఉద్యమాల పాత్ర, మన సమాఖ్య వ్యవస్థ స్వభావం, భారత ప్రజాస్వామ్య గణతంత్రం, చైతన్యవంతమైన లక్షణాలు ఉన్నాయని తెలిపారు.

మెరుగైన పాలన కోసం

కేరళ ప్రభుత్వ మెగా ఔట్ రీచ్

- షెడ్యూల్ ప్రకటించిన మంత్రివర్గం

తిరువనంతపురం : పాలనను మరింత మెరుగుపరిచేందుకు, ప్రజల వద్దకు పాలనను తీసుకెళ్లేందుకు గానూ కేరళ ప్రభుత్వం మెగా పబ్లిక్ ఔట్‌రీచ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కేరళ ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. అభివృద్ధి క్రమాన్ని మరింత వేగిరపరిచేందుకు, జిల్లా స్థాయిలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన మంత్రివర్గ సహచరులు ప్రత్యక్షంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. సెప్టెంబరు 4, 7, 11, 14 తేదీల్లో మంత్రివర్గం అధ్యక్షతన కొజికోడ్, త్రిస్సూర్, ఎర్నాకులం, తిరువనంతపురంలలో జోనల్ సమావేశాలు జరుగుతాయి. ఆయా తేదీల్లో స్థానిక శాంతి భద్రతల విభాగ అధికారులతో జరిగే సమావేశానికి ముఖ్యమంత్రి విజయన్ అధ్యక్షత వహిస్తారు. జిల్లా స్థాయిలో అత్యంత తీవ్రంగా వున్న సమస్యలన్నింటినీ జూన్ 20నాటికల్లా సేకరించాల్సిందిగా జిల్లా కలెక్టర్లను కేబినెట్ కోరింది. జోనల్ సమావేశాల్లో వాటిని ప్రవేశపెడతారు. మౌలిక ప్రాతిపదిక సౌకర్యాల అభివృద్ధి ప్రాజెక్టులను కేబినెట్ సమీక్షిస్తుంది. సంక్షేమ పెన్షన్ల పంపిణీపై విశ్లేషణ జరుపుతుంది. జిల్లా స్థాయిలో సంక్షేమ కార్యక్రమాల పనితీరును సమీక్షిస్తుంది. కేంద్ర పథకాల పురోగతిని కూడా మంత్రిత్వ స్థాయి ప్రతినిధి వర్గం సమీక్షించి, వేగంగా అమలు చేయడానికి అడ్డంకులేమైనా వుంటే వాటిని తొలగిస్తుంది. జాతీయ హైవేల అభివృద్ధి, హై రేంజ్ హైవేలు, తీరప్రాంత హైవేలు, జాతీయ జల మార్గాలు, బైపాస్‌లు, రింగ్ రోడ్లు, ఓవర్‌బ్రిడ్జిలు వీటిల్లో వున్నాయి. ప్రజారోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులు, అంగన్‌వాడీలు, సివిల్ స్టేషన్లు, ప్రభుత్వ పాఠశాలల్లో సిబ్బంది సమస్యలను పరిష్కరించడానికి, మరిన్ని మౌలిక సదుపాయాలను అందచేయాల్సిన అవసరం గురించి కూడా కేబినెట్ చర్చిస్తుంది. లైఫ్ మిషన్ ప్రాజెక్టుల పురోగతిని, వాటి నిర్వహణను మంత్రిత్వ స్థాయి సమావేశం సమీక్షిస్తుంది.

సమస్యలను మూడు గ్రూపులుగా జోనల్ సమావేశాలు వర్గీకరిస్తాయి, మంత్రిత్వ స్థాయిలో పరిష్కరించగలిగేవి, జిల్లా స్థాయిలో పరిష్కరించగలిగేవి, ఈ రెండు కేటగిరీల్లోకి రానివి మూడో కేటగిరీగా వర్గీకరిస్తారు. జోనల్ సమావేశాలకు ముందుగానే సమస్యలను గుర్తించి, వాటి పరిష్కరించేందుకు గానూ వివిధ విభాగాల ప్రధాన కార్యదర్శులు కలెక్టర్లతో అనుసంధానమవుతారు. జోనల్ సమావేశాల్లో మంత్రులకు చీఫ్ సెక్రటరీ, ప్రిన్సిపల్ కార్యదర్శులు సాయపడతారు. నిర్ణయం జరిగిన 48గంటల్లోగా అవసరమైన ఆదేశాలను ప్రభుత్వం జారీ చేస్తుంది.

కావేరీ ఆస్పత్రికి సెంథిల్

- గుండె శస్త్రచికిత్సకు కోర్టు అంగీకారం

చెన్నై : తమిళనాడు విద్యుత్ శాఖ మంత్రి వి. సెంథిల్ బాలాజీని గుండె శస్త్రచికిత్స నిమిత్తం కావేరీ ఆస్పత్రికి తరలించేందుకు మద్రాస్ హైకోర్టు గురువారం అనుమతించింది. సెంథిల్ సతీమణి మేఘల దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ జె.నిషా భాను, డి.భరత చక్రవరితో కూడిన డివిజన్ బెంచ్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. సెంథిల్ ఆరోగ్య పరిస్థితిపై ఒమందురర్ మల్టీ స్పెషాలిటీ ప్రభుత్వ ఆస్పత్రి, ఈఎస్‌ఐ ఆస్పత్రి వైద్య బృందం అందజేసిన నివేదికను మేఘల న్యాయస్థానానికి సమర్పించారు. సెంథిల్‌కు అత్యవసర వైద్య సాయం అందించాల్సిన అవసరం ఉన్నదని వైద్య బృందం అభిప్రాయపడింది. సెంథిల్ ఇప్పటికే ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యులను సంప్రదిస్తున్నారని డివిజన్ బెంచ్ తెలిపింది. అయితే సెంథిల్‌ను కావేరీ ఆస్పత్రికి తరలించడాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వ్యతిరేకించింది. ఈఎస్‌ఐ వైద్యులు భిన్నాభిప్రాయం వ్యక్తం చేయడంతో ఢిల్లీకి చెందిన ఎయిమ్స్ వైద్యుల బృందం ఆయన ఆరోగ్య స్థితిపై నివేదిక ఇచ్చిందని తెలిపింది. సెంథిల్ శరీరంలోని అవయవాలు బాగానే పనిచేస్తున్నాయని, ఆయనను అరెస్టు చేయడానికి ముందు వైద్య పరీక్షలు జరిపామని ఈడీ తరపున వాదించిన అడిషనల్ సొలిసిటర్ జనరల్ సుందరేశన్ చెప్పారు. ఆ తర్వాత తనకు ఛాతిలో నెప్పిగా ఉందని సెంథిల్ చెప్పడంతో మరోసారి పరీక్ష చేయించామని వివరించారు. సెంథిల్‌ను ప్రైవేటు ఆస్పత్రికి తరలించే బదులు ఒమందురర్ ఆస్పత్రిలోనే చికిత్స చేయించవచ్చునని వాదించారు. ఈ వాదనతో సెంథిల్ న్యాయవాది ఎలంగో విభేదించారు. సెంథిల్‌కు బైపాస్ సర్జరీ అవసరమని, జ్యుడీషియల్ కస్టడీలోనే ఆయనను కావేరీ ఆస్పత్రికి తరలించవచ్చునని వాదించారు.

మరో రూ.242 కోట్ల మార్గదర్శి ఆస్తుల జప్తు

- మొత్తం సిఐడి జప్తులో రూ.1,035 కోట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మార్గదర్శి చిట్స్ అక్రమాల కేసులో ఎపి సిఐడి మరో రూ.242 కోట్లను గురువారం జప్తు చేసింది. ఇప్పటికే మే 29న మార్గదర్శి చిట్స్‌కు సంబంధించి రూ.793.50 కోట్లను జప్తు చేసిన సిఐడి ఇప్పటి వరకు మొత్తంగా రూ.1,035 కోట్ల ఆస్తులను జప్తు చేసింది. కేంద్ర చిట్‌ఫండ్ యాక్ట్‌ను ఉల్లంఘిస్తూ మార్గదర్శి చిట్స్ నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్‌లను సేకరించడంతోపాటు నిధులను తమ సొంత కంపెనీల్లోకి అక్రమంగా మళ్లించుకున్నట్లు సిఐడి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది.

ఈ కేసులో ఇప్పటికే ఎ1 చెరుకూరి రామోజీరావు, ఎ2 చెరుకూరి శైలజను పలు దఫాలుగా విచారించిన సిఐడి పలు లొసుగులున్నట్లు గుర్తించింది. ఏడు కేసులను నమోదు చేసింది. కేంద్ర చిట్‌ఫండ్ చట్టాన్ని అనుసరిస్తున్నట్లు ఆధారాలు చూపితే కొత్త చిట్టీలకు అనుమతిస్తామని తెలిపింది.

బ్రిజ్ భూషణ్‌పై ఛార్జిషీట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్‌ఐ) మాజీ చీఫ్, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఢిల్లీ పోలీసులు గురువారం ఛార్జిషీటు దాఖలు చేశారు. రెజ్లర్లను ఆయన లైంగికంగా వేధించినట్లు నమోదైన కేసుల్లో పాటియాలా హౌస్ కోర్టులో ఈ ఛార్జిషీటును దాఖలు చేశారు. బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్, ఆయన సహాయకుడు వినోద్ తోమర్‌పై దాడి, లైంగిక వేధింపులకు సంబంధించిన వ్యాఖ్యలు చేయడం, వెంబడించడం వంటి అభియోగాలపై స్థానిక కోర్టులో 1,082 పేజీల ఛార్జిషీట్ దాఖలు చేశారు.

సింగ్‌పై ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి) సెక్షన్ 354 (దౌర్జన్యం చేసే ఉద్దేశంతో దాడి, నేరపూరిత శక్తి), 354-ఎ (లైంగిక వేధింపులతో కూడిన వ్యాఖ్యలు చేయడం), 354-డి (వెంబడించడం) కింద అభియోగాలు మోపినట్లు న్యూఢిల్లీ డిప్యూటీ పోలీస్ కమిషనర్ ప్రణవ్ తాయల్ తెలిపారు. తోమర్‌పై ఐపిసి సెక్షన్లు 109 (ప్రేరేపణ), 354, 354-ఎ, 506 (నేరపూరిత బెదిరింపు) కింద అభియోగాలు మోపారు. ఇద్దరినీ అరెస్టు చేయడం తప్పనిసరి కాదని తయాల్ అన్నారు.

నిందితులకు వ్యతిరేకంగా దర్యాప్తు అధికారులు సాక్ష్యాలను కనుగొన్నారని, అయితే వారు గరిష్టంగా ఐదేళ్ల శిక్షను ఎదుర్కొంటున్నందున, వారిని అరెస్టు చేయడం తప్పనిసరి కాదని పోలీస్ అధికారి తెలిపారు. ఓవర్సీస్ రెజ్లింగ్ ఫెడరేషన్ల నుంచి కోరిన వివరాలు ఇంకా అందలేదు. కాబట్టి, నిందితులపై అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేయొచ్చని అధికారి తెలిపారు. 'ఇది ఒక ఛార్జిషీట్. తుది నివేదిక కాదు. కాబట్టి, ప్రాథమిక ఛార్జిషీట్‌ను దాఖలు చేసిన తరువాత ఏది లభించినా, అది కచ్చితంగా అనుబంధ ఛార్జిషీట్‌లో చేర్చబడుతుంది. అలాగే, ఫొటోలు, వీడియోలు, ఆడియో వంటి డిజిటల్ సాక్ష్యాల ఫోరెన్సిక్ నివేదికలు ఇంకా లేబొరేటరీల నుంచి పొందలేదు. మేము అనుబంధ ఛార్జిషీట్‌లో చేర్చవచ్చు' అని అధికారి అన్నారు. ఇద్దరు నిందితులు దర్యాప్తులో చేరారు. వారు కూడా సహకరించారు. "వారి చిరునామాలు ధ్రువీకరించబడ్డాయి. వారు తప్పించుకునే అవకాశం లేదు' అని ఛార్జిషీట్‌లో పేర్కొన్నారు. లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ (పోక్సో) చట్టం కింద దాఖలైన రెండో కేసులో సింగ్‌పై ఎలాంటి ఆధారాలు లభించలేదని ఢిల్లీ పోలీసులు కోర్టుకు తెలిపారు. ఆయనపై పోక్సో కేసును కొట్టేయాలని కోరారు.కోర్టులో దాఖలు చేసిన పోలీసుల 552 పేజీల రద్దు నివేదికలో ఒక మైనర్ రెజ్లర్, ఆమె తండ్రి, ఫిర్యాదుదారు, సింగ్, ఇతర సాక్షుల వాంగ్మూలాలను ఉదహరించారు. దీనిపై తదుపరి విచారణను కోర్టు జులై 4న చేపట్టనుంది. ఈ విషయంపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) 180 మందిని విచారించింది.

ప్రతి నియోజకవర్గంలో ఆర్‌డి సెంటర్లు

యువగళం పాదయాత్రలో లోకేష్ హామీ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి


కామారెడ్డిపల్లె గ్రామస్తులతో ముచ్చటిస్తున్న లోకేష్

టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి నియోజకవర్గంలో ఐటి ఉద్యోగాలు కల్పించే విధంగా రూరల్ డెవలప్‌మెంట్ (ఆర్‌డి) సెంటర్లు ఏర్పాటు చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ నిచ్చారు. తక్కువ ఖర్చుతో ఆర్‌డి సెంటర్లు ఏర్పాటు చేసేలా ప్రోత్సాహం అందిస్తామన్నారు. తద్వారా యువతకు స్థానికంగానే ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర గురువారం నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజక వర్గంలో కొనసాగింది. బొమ్మవరం క్యాంపుసైట్ వద్ద 'హలో లోకేష్' కార్యక్రమాన్ని నిర్వహించారు. జగన్ పాలనలో జాబ్ కేలండర్ విడుదల కావడం లేదని, పరిశ్రమలు రావడం లేదని, రాష్ట్రంలో ఐటీ కంపెనీలు లేక ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లి అనేక ఇబ్బందులు పడుతున్నామని తమ సమస్యలను లోకేష్‌కు యువత వివరించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ..జగన్ పాలనలో విదేశీ విద్య పథకం రద్దు చేశారని, ఎపిలో డ్రగ్స్, గంజాయి వినియోగం పెరిగిపోయిందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని సెంచూరీ ప్లై వుడ్ పరిశ్రమను వేరే ప్రాంతానికి తరలించారని విమర్శించారు. చంద్రబాబు పాలనలో ఆంధ్రప్రదేశ్ జాబ్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా ఉందని, జగన్ పాలనలో గంజాయి క్యాపిటల్ ఆఫ్ ఇండియా మారిపోయిందని ఆరోపించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌ను నిర్వీర్యం చేసి, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గంజాయిపై యుద్ధం ప్రకటించి, గంజాయి సరఫరా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. విజనరీ చంద్రబాబు పాలనలో హెచ్‌సిఎల్, కాండ్యుయెంట్, కియా, టిసిఎల్, డిక్షన్ లాంటి కంపెనీలు వచ్చాయన్నారు. ప్రిజనరీ పాలనలో ఫాక్స్ కాన్, రిలయన్స్, అమర్ రాజా లాంటి కంపెనీలు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాయని తెలిపారు. కార్యక్రమంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ నేతలు తిరుమల నాయుడు, అమ్రుల్లా, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఆనం శుభకర్‌రెడ్డి, సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు పార్లమెంట్ భవనం సురక్షితం కాదు

- ఆస్ట్రేలియన్ ఎంపి

సిడ్నీ : ఆస్ట్రేలియా దేశ పార్లమెంట్ భవనం మహిళలకు సురక్షిత ప్రదేశం కాదని ఓ మహిళా ఎంపీ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ వేదికగా తాను లైంగిక దాడికి గురయ్యాననీ, ఈ పార్లమెంట్ భవనం మహిళలు విధులు నిర్వర్తించడానికి సురక్షితంగా లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సెనెట్ సభలో ప్రసంగిస్తూ.. స్వతంత్ర సెనెటర్ లిడియా థోర్ప్ కన్నీటి పర్యంతమయ్యారు. అయితే తన తోటి సెనెటర్ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని బుధవారమే పేర్కొన్నప్పటికీ.. పార్లమెంట్ ఆంక్షలతో ఈ వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారు. సెనెటర్ డేవిడ్ వాన్ తనతో దారుణంగా ప్రవర్తించారని ఆమె గురువారం మరోసారి పునరుద్ఘాటించారు. తనను తీవ్రంగా లైంగిక వేధింపులకు గురిచేశాడని వివరించారు. తనను వాన్ అనుసరించేవారని, అభ్యంతరకరంగా తాకేవారని, దీంతో ఆఫీసు గదిలో నుంచి బయటకు రావాలంటేనే భయపడేదాన్నని వాపోయారు. డోర్ కొంచెం తెరిచి బయట ఆయన లేరని నిర్ధారించుకున్న తర్వాతే వచ్చేదాన్నని, పార్లమెంట్ ప్రాంగణంలో నడవాల్సి వచ్చినప్పుడు తోడుగా ఎవరో ఒకరు ఉండేలా చూసుకున్నానని కన్నీటి పర్యంతమయ్యారు. తనలాగే ఇంకొందరు కూడా ఇలాంటి వేధింపులు అనుభవిస్తున్నారని అన్నారు. కానీ, భయపడి వారు బయటకు రావట్లేదని, ఈ భవనం మహిళలకు సురక్షిత ప్రదేశం కాదని అన్నారు. పార్లమెంట్ నిబంధనలకు అనుగుణంగా తాను కేసు పెట్టనున్నట్టు తెలిపారు.

బెంగాల్‌లో తృణమూల్ ఆగడాలు

- 'పంచాయతీ' నామినేషన్ల పర్వంలో హింస
- వామపక్ష కార్యకర్త హత్య
- నామినేషన్లు వేయకుండా అడ్డుకున్న టిఎంసి గూండాలు
- నిరసనగా రాష్ట్రవ్యాప్త ప్రదర్శనలు

కొల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. పంచాయతీ ఎన్నికలలో నామినేషన్లు దాఖలు చేయకుండా ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను అడ్డుకుంటున్నారు. దాడులకు తెగబడుతూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. నామినేషన్ల దాఖలుకు చివరి రోజైన గురువారం హింసాకాండ చెలరేగింది. ఉత్తర దినాజ్‌పూర్ జిల్లాలోని చోప్రాలో వామపక్షాలు, కాంగ్రెస్ సంయుక్తంగా నిర్వహించిన ర్యాలీపై తృణమూల్ కాంగ్రెస్ దుండగులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో వామపక్ష కార్యకర్త మన్సూర్ అలీ ప్రాణాలు కోల్పోయారు. కాంగ్రెస్, వామపక్షాలకు చెందిన పలువురు కార్యకర్తలకు గాయాలయ్యాయి. భంగోర్‌లో తృణమూల్ కాంగ్రెస్, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ (ఐఎస్‌ఎఫ్) మధ్య జరిగిన ఘర్షణలో ఐఎస్‌ఎఫ్ కార్యకర్త ప్రాణాలు కోల్పోయారు.

చోప్రాలో కాంగ్రెస్, వామపక్ష కార్యకర్తలు నామినేషన్ల దాఖలు కార్యక్రమానికి ర్యాలీగా వెళుతుండగా ప్రదర్శనపై హఠాత్తుగా కాల్పులు మొదలయ్యాయి. లాల్ బజార్, దాస్‌పరా నుండి నామినేషన్లు వేసేందుకు వెళుతుంటే తృణమూల్ మద్దతుదారులు అడుగడుగునా అడ్డు తగిలారని సిపిఎం కార్యకర్త ఒకరు తెలిపారు. స్థానిక తృణమూల్ ఎమ్మెల్యే నివాసం సమీపంలో కాల్పులు జరిగాయని ఆయన చెప్పారు. ఐదుగురిపై కాల్పులు జరిగాయని, వారిలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారని వివరించారు. గాయపడిన వారిలో ఒకరు ఆ తర్వాత చనిపోయారని తెలిపారు. వాహనమేదీ అందుబాటులో లేకపోవడంతో ఆయనను మోసుకుంటూ ఆస్పత్రికి తరలించామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో పోలీసుల ఉదాశీనతపై వామపక్ష కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకుంటామంటూ తృణమూల్ కార్యకర్తలు ఉదయం నుండే తమను బెదిరించారని కాల్పుల ఘటనలో గాయపడిన సిపిఎం కార్యకర్త చెప్పారు. గతంలో కూడా వారు చాలా సార్లు ఇలాంటి బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. కాగా కాల్పుల ఘటనలో ఇద్దరు వామపక్ష కార్యకర్తలు మరణించారని, 20 మందికి పైగా గాయపడ్డారని అనధికారిక వార్తలు తెలిపాయి.

ఉత్తర 24 పరగణాల జిల్లా బరాసత్, దక్షిణ 24 పరగణాల జిల్లా భన్‌గర్‌లో కూడా నామినేషన్లు దాఖలు చేయకుండా తృణమూల్ దుండగులు వామపక్ష కార్యకర్తలను అడ్డుకున్నారు. కాగా చాలా చోట్ల నామినేషన్లు దాఖలు చేయకుండా ప్రతిపక్ష అభ్యర్థులను నిరోధించారని వార్తలు వస్తున్నాయి. తృణమూల్ ఆగడాలు పెచ్చరిల్లుతున్నప్పటికీ పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. నామినేషన్ల దాఖలుకు చివరి రెండు రోజులు పలుచోట్ల తృణమూల్ కార్యకర్తలు భయానక వాతావరణాన్ని సృష్టించారని, కర్రలతో స్వైరవిహారం చేస్తూ అడ్డంకులు సృష్టించారని వార్తలు వచ్చాయి.

కాగా చోప్రా ఘటనకు నిరసనగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం ఎదుట, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో వామపక్షాలు ప్రదర్శనలు నిర్వహించాయి. ప్రదర్శన అనంతరం ఎన్నికల కమిషన్‌కు వినతిపత్రం అందించారు. హింస పెచ్చరిల్లుతున్నా రాష్ట్ర ఎన్నికల కమిషన్ పట్టనట్లు వ్యవహరిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ సలీం విమర్శించారు. ఎన్నికల కమిషన్‌లో ఎలాంటి చలనం కన్పించడం లేదని, బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తోందని ధ్వజమెత్తారు. తృణమూల్ గూండాలకు రాష్ట్ర పోలీసులు సహకరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాగా చోప్రా ఘటనను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కలకత్తా హైకోర్టు దృష్టికి తీసికెళ్లారు. ప్రతిపక్ష అభ్యర్థులు కోర్టులో నామినేషన్లు అందజేస్తే వారికి సహకరిస్తామని హైకోర్టు న్యాయమూర్తి రాజశేఖర్ మహంతా హామీ ఇచ్చారు. ప్రతిపక్ష అభ్యర్థులకు భద్రత కల్పించాలని రాష్ట్ర పోలీసులను ఆయన ఆదేశించారు.

ఎపి ఫైబర్ నెట్ ద్వారా ఫస్ట్ రోజే ఫస్ట్ షో

ఛైర్మన్ గౌతంరెడ్డి

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

విడుదలయ్యే సినిమా తొలిరోజే తొలి షో ఫైబర్ నెట్ ద్వారా ప్రసారం చేయనున్నట్లు ఎపి ఫైబర్ నెట్ ఛైర్మన్ పి గౌతంరెడ్డి అన్నారు. రూ.39కే లవ్‌యు టూ సినిమాను ప్రసారం చేయనున్నట్లు పేర్కొన్నారు. విజయవాడలోని ఫైబర్‌నెట్ కార్యాలయంలో గురువారం లవ్‌యు టూ సినిమా చిత్ర యూనిట్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. వినూత్న విధానాలతో అతి తక్కువ ఖర్చులతో నూతన సినిమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. నిర్మాతకు, ప్రేక్షకుడికి లాభం కలిగేలా ఫైబర్‌నెట్ ద్వారా సినిమాలు ప్రసారం చేస్తున్నట్లు చెప్పారు. నిరీక్షణ అనే సినిమాను ఇప్పటికే ప్రసారం చేశామని తెలిపారు. జూన్ 16న లవ్‌యు టూ సినిమా స్ట్రీమింగ్ అవుతుందని వివరించారు. సబ్ స్క్రైబ్ చేసుకున్న తరువాత 24 గంటల వరకూ సినిమాను చూసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎపిఎఫ్ఎస్ఎల్‌ను ఒక థియేటర్‌గానే చూడాలని, ఏ ప్లాట్‌ఫాంకు ఇది పోటీ కాదని అన్నారు. చిన్న చిత్రాల నిర్మాతలను ప్రోత్సహించాలన్నదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జిఓ 13 ప్రకారం రూ.100 కోట్ల బడ్జెట్ మూవీకి మొదటి వారంపాటు టికెట్ ధరను పెంచుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. రూ.20 కోట్లలోపు చిత్రాలను చిన్న సినిమాలుగా గుర్తిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో థియేటర్లో విడుదలయ్యే ప్రతి సినిమానూ ఫైబర్‌నెట్ ద్వారా విడుదల చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఎపిఎస్ఎఫ్ఎల్ త్వరలోనే యాప్‌ను తీసుకొస్తుందని, దీని ద్వారా పాత, కొత్త సినిమాలు చూడొచ్చని అన్నారు. ఎపిఎస్ఎఫ్ఎల్ ఎండి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో మొట్టమొదటిసారిగా కొత్తటెక్నాలజీని వినియోగించి విడుదలైన రోజే ఫైబర్‌నెట్ ద్వారా సినిమా చూసే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. లవ్‌యు టూ సినిమా హీరో ఆట సందీప్ మాట్లాడుతూ.. ఫస్ట్ డే ఫస్ట్ షో విధానం బాగుందని అన్నారు. సినిమా నేరుగా జనాల్లోకి వెళ్లడం ద్వారా తమలాంటి హీరోలకు ప్రోత్సాహకంగా ఉంటుందని అన్నారు. హీరోయిన్లు జ్యోతిరాజ్, ప్రాచీ మాట్లాడుతూ మధ్య తరగతి వారికి కూడా సినిమా నేరుగా చూసే అవకాశం కల్పించడం అభినందనీయమని అన్నారు. చిత్ర దర్శకుడు శ్రీకాంత్, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు అయోధ్యరామిరెడ్డి

కృష్ణబలిజ, పూసల కులాలను బిసి-ఎలో చేర్పిస్తాం

ఎంపి అయోధ్య రామిరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కృష్ణబలిజ, పూసల, దాసరి తదితర కులాలను బిసి-డి నుంచి బిసి-ఎ జాబితాలోకి మార్చేందుకు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి హామీ ఇచ్చారు. గుంటూరులో గురువారం కృష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ కార్యవర్గం ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ కులాలను బిసి-డిగా ఉంచడం వల్ల ఎన్నో విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నామని, ఈ దృష్ట్యా బిసి-ఎలో చేర్చాలని సంఘ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకు స్పందించిన అయోధ్యరామిరెడ్డి ఈ అంశాన్ని సిఎం జగన్ దృష్టికి, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. పల్నాడు జిల్లా కోటప్పకొండలో కృష్ణబలిజ, పూసల సంఘీయుల సత్రం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, వృద్ధులకు వసతి గృహాల నిర్మాణం నిమిత్తం తాను రూ.25 లక్షలు ఇస్తానని తెలిపారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ బిసిల అభ్యున్నతికి వైసిపి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. సమావేశంలో రాష్ట్ర కృష్ణ బలిజ - పూసల కార్పొరేషన్ ఛైర్మన్ కోలా భవాని మణికంఠ, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి ప్రణయ్, సంఘం అధ్యక్షులు కోలా అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి పాశం వెంకటేశ్వరరావు, కోశాధికారి అన్నం రమేష్, పలువురు సంఘం నాయకులు, కృష్ణ బలిజ వర్గీయులు పాల్గొన్నారు.

మీ కోసం

మిగిలిన అన్నాన్ని ఎండబెట్టి రవ్వలా తయారు చేసుకుంటే ఇడ్లీల పిండిలోకి ఉప్పుడు రవ్వలా ఉపయోగపడుతుంది.

జీవన సౌరభం

అదృష్టం కోసం ఎదురుచూడడం కష్టం. అవకాశం సృష్టించుకోవడం సులభం..

అనుకోవాలి

గగన తలానికెగసి
సూర్యుని తాపాన్ని సైతం
లెక్క చేయక దూసుకెళ్ళే డేగలా
ఈ ప్రపంచమంత చుట్టి రావాలని అనుకోవాలి ..!

ప్రవాహం ఎంత తీవ్రమైనా
ఏటికి ఎదురెల్లే చేపలా
సమస్య ఏదైన ఎంతటిదైనా
పరిష్కారం దిశగా ఎదురెళ్లాలని అనుకోవాలి ..!

ఓటమిని అంగీకరించని
వీర సైనికునిలా యుద్ధరంగంలో
వెనకడుగు వేయని యోధునిలా
అలుపెరుగక సాగిపోవాలని అనుకోవాలి ..!

శక్తి యుక్తి నీవై ధీరోదాత్తుడిగా
కలలు కన్న కళను వెలికి తీసి
తమదైన ముద్ర వేసుకోవాలని అనుకోవాలి ..!

సాధనతో సాధ్యం కానిది ఏదీ లేదని
సమస్తాన్ని జయించవచ్చని
అనుకొంటే కానిది ఏమున్నది!
మనిషి అనుకొంటే
సాధించలేని దేమున్నది అని అనుకోవాలి ..!

- లక్ష్మి శ్రీనివాస్
96766 01192



లెక్క తేల్చండి

చిన్నారులూ, ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 82

సరైన నీడ ఏది?

చిన్నారులూ, బంటీ చేపలు పట్టుకుని ఇంటికి వెళుతున్నాడు. ఎదురుగా కొన్ని నీడలు ఉన్నాయి. వాటిలో తన సరైన నీడను కనిపెట్టండి.

జవాబు : 4



నేను గీసిన బొమ్మ



శ్రీరాం కార్తికేయ చల్లపల్లి,
8వ తరగతి,
పిట్జీ స్కూలు,
విజయవాడ,
ఎన్టీఆర్ జిల్లా.

సవరణ

జూన్ 11న చిన్నారి శీర్షికలో వచ్చిన 'లెక్కలు చేద్దాం'లో ఇచ్చిన జవాబు 68ని 66గా చదువుకోగలరు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆ పిల్లల బతుకుల్లో విద్యాదీపం

తల్లిదండ్రులు నేరం చేస్తే సమాజంలో వారి పిల్లలు వివక్షకు గురవుతున్నారు. చుట్టూ ఉన్నవారు, తోటి పిల్లలు ఎందుకు దూరం పెడుతున్నారో తెలియదు. అటువంటి నేరస్తుల కుటుంబాల పిల్లలను అక్కున చేర్చుకుంటున్నాడు రాజా. వారికి చదువు చెప్పించి, వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఓ వైపు పోలియోతో ప్రతికూల పరిస్థితులను సైతం ఎదుర్కొంటూ వారి కుటుంబాలకు ఆర్థిక సాయం చేస్తూ ఆకలి బాధ తీర్చుతున్నారు.

తమిళనాడులో మధురైకి చెందిన రాజాకు మూడేళ్ల వయసులోనే పోలియో వచ్చింది. దాంతో రెండు కాళ్లు చచ్చుబడ్డాయి. కానీ, చురుకుగా ఉండేవాడు. చదువులో ముందుండేవాడు. వికలాంగుడిగా ఎన్నో సందర్భాల్లో ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. అవమానాలూ భరించాడు. ఆ స్థితి నుంచి బయటపడాలంటే చదువు ఒక్కటే మార్గం అని నిర్ణయించుకున్నాడు. పుట్టింది పేద కుటుంబంలోనైనా దాతల సహాయంతో చదువుకున్నాడు. మానసిక సలహాదారుగా, క్రిమినాలజిస్టుగా, వైద్య సామాజిక కార్యకర్తగా, న్యాయవాదిగా డిగ్రీలు పుచ్చుకున్నాడు. సామాజిక కార్యకర్తగా పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారు. పుదుచ్చేరిలో చదువుతున్నప్పుడు 'ఖైదీల మానసిక సంఘర్షణ- ఆలోచనలు' అనే అంశంపై థీసిస్ కోసం జైలుకు వెళ్లారు. అక్కడ వారితో మాట్లాడుతున్నప్పుడు రాజాకు లోతైన మానసిక గాయాలతో బాధపడుతున్న వ్యక్తులు తారసపడ్డారు. జీవితంలో సరిద్దుకోలేని తప్పులు చేసి పశ్చాతాపడుతున్న వారు, సరిదిద్దుకోవాలనుకుంటున్న వారు, కుటుంబ సభ్యులతో గడపలేక పోతున్నందుకు కుంగిపోయిన వారూ ఉన్నారు. వారు చేసినవి ఎక్కువగా మద్యం మత్తులో జరిగిన నేరాలే అని రాజాకు అర్థమైంది. భార్యలను చంపిన భర్తల కేసులే అధికం. ఆవేశంలో తీసుకున్న నిర్ణయాలే వారిని జైలుపాలు చేశాయి. అయితే వారి పిల్లలు అనాథలుగా బతుకు ఈడుస్తున్న పరిస్థితులు వారిని మరింత బాధ పెడుతోందని తెలుసుకున్నారు. వారి మాటలు రాజాను ఆలోజింపజేశాయి. వాళ్ల కోసం ఏదో ఒకటి చేయాలనుకున్నారు. ఖైదీలతో సత్సంబంధాలను ఏర్పరచుకుని వారి కుటుంబాలకు సహాయం చేసే మార్గాలను అన్వేషించారు.

సంస్థ ద్వారా ...

2012లో 'గ్లోబల్ నెట్‌వర్క్ ఫర్ ఈక్వాలిటీ' సంస్థను స్థాపించారు. రాష్ట్రంలో వివిధ జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు దాని ద్వారా కౌన్సెలింగ్ చేశారు. మానసిక వ్యాధితో బాధపడుతున్న ఎంతో మందికి వైద్యం అందించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడినప్పుడు సమాజంలో తాము పడుతున్న వేదనను రాజాకు చెప్పుకుని బాధపడ్డారు. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు అనాధలుగా శరణాయాల్లో, పనివాళ్లుగా జీవిస్తున్నారు. కొంతమంది ఖైదీల పిల్లలను బడిలో చేర్చుకోవడం లేదని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పిల్లలతోనూ రాజా మాట్లాడారు. తల్లి, తండ్రే నేరం చేయడం చూసి దిగ్భ్రాంతికి గురయ్యి మానసికంగా దెబ్బతిన్న వారికీ కౌన్సిలింగ్ చేశారు. సమాజంలో వారి పట్ల చిన్నచూపు, ఎదుర్కొన్న అవమానాలను చెప్పారు. ఇవన్నీ రాజాను ఎంతో ప్రభావితం చేశాయి. అప్పటికే వికలాంగ హక్కుల కార్యకర్తగా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు రాజా. బృందంలో కొంతమంది వ్యక్తులు కలిసి- ఖైదీల జీవన నాణ్యతను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. వారి పిల్లలకు విద్య చెప్పాలనుకున్నారు. సుమారు 1200 మంది పిల్లలను చేరదీసి తమ సంస్థ ద్వారా చదువు చెప్పిస్తున్నారు. వారి మానసిక ఆరోగ్యం కోసం ప్రతిరోజూ కౌన్సిలింగ్ ఉంటుంది. వ్యక్తిగత దాతల సహాయంతో మెరుగైన విద్యను అందిస్తున్నాడు.

కన్యాకుమారిలోని మారుమూల గ్రామానికి చెందిన మహాలి (12), దీపలి (13) ఇద్దరు అక్కాచెల్లెళ్లు. తండ్రి జైలుకెళ్లడంతో అనాథలయ్యారు. హోటళ్లలో పనిచేస్తూ ఆకలి తీర్చుకున్నారు. రాజా వారిని చేరదీసి, చదివించాడు. వారిప్పుడు లా కంప్లీట్ చేసి లాయర్స్‌గా ప్రాక్టీస్ చేస్తున్నారు. తిరునెల్వేలికి చెందిన మయిల్‌లి 14 ఏళ్ల వయస్సులో కలిశాడు రాజా. నిరాశతో కుంగిపోయిన మయిల్‌కి ధైర్యం చెప్పి మార్గదర్శిగా నిలిచాడు. బయో మెడికల్ ఇంజినీరింగ్‌లో కోర్సు కంప్లీట్ చేయించాడు. ఇప్పుడు వైద్య పరికరాల కంపెనీలో నాణ్యతా విశ్లేషకుడిగా మయిల్‌లి స్థిరపడ్డాడు. ఇలా ఖైదీల పిల్లలకు స్కాలర్‌షిప్ పథకాలు, ఉచిత విద్య, హాస్టల్ వసతిని కల్పిస్తూ పూర్తి సంరక్షకుడుగా మారి వారి అభ్యున్నతకి కృషి చేస్తున్నాడు రాజా.

కూలర్ వాసన రాకుండా ...

వేసవి కాలంలో చల్లదనం కోసం కూలర్లను చాలామంది ఉపయోగిస్తుంటారు. అయితే వీటిని సరైన పద్ధతిలో ఉపయోగించుకోకపోతే సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అలాగే కూలర్లలోని నీరు వాసన రాకుండా చూసుకోవాలి.

బయట దుమ్ము, తేమ కారణంగా కూలర్ వాసన రావటం మొదలవుతుంది. నీరు నిల్వ ఉన్నా చెడు వాసన వస్తుంది. ఒక్కోసారి కూలర్‌లోని గడ్డి, కూలింగ్ ప్యాడ్‌లోని అచ్చు నుంచి కూడా దుర్వాసన వస్తుంది.

ఏం చేయాలి?

- వారానికోసారైనా కూలర్లో నీటిని పూర్తిగా తీసేసి శుభ్రం చేయాలి. వేప ఆకులను ఓ కాటన్ గుడ్డలో కట్టాలి. ఈ వస్త్రం చాలా పలుచగా ఉండాలి. ఇలా తయారు చేసిన వేప ఆకుల మూటను కూలర్ నీటిలో ఉంచాలి. ఇలా చేయడం వల్ల నీరు వాసన పట్టదు. క్రిమికీటకాలు కూడా వృద్ధి చెందవు. ప్రతి 3-4 రోజులకు ఒకసారి వేప ఆకులను మార్చాలి.
- నారింజ తొక్కను ఎండబెట్టి పౌడర్ చేసుకోవాలి. దీనికి కాస్త దాల్చిన చెక్కను కూడా కలపాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని కూలర్ నీటిలో కొద్ది మొత్తంలో చల్లుకోవాలి.
- నీటిలో 1 టీస్పూన్ బేకింగ్ సోడాను చల్లాలి. ఇలా ప్రతి రోజూ కూలర్‌లో నీటిని నింపిన వెంటనే వంట సోడా చల్లుతుంటే నీళ్లు వాసన రావు.

నిమ్మ తొక్కల్లో ఆరోగ్య ప్రయోజనాలు..

వేసవిలో నిమ్మకాయలను ఎక్కువగా ఉపయోగిస్తుంటాం. రసం పిండేసి ఆ తొక్కలను పారేస్తాం. అయితే నిమ్మ తొక్కల్లో ఉన్న ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే వాటిని పారేయరు. అవేంటో చూద్దాం.

- నిమ్మ తొక్కల్లో విటమిన్ సి ఉంటుంది.
- నిమ్మ తొక్కలలో ఉండే బయోఫ్లావనాయిడ్స్ ఎముకల ఆరోగ్యానికి, ఒత్తిడిని ఎదుర్కోవడానికి ఉపయోగపడతాయి.
- నిమ్మ తొక్కలు యాంటీ బాక్టీరియల్ భాగాలను కలిగి ఉంటాయి. ముఖ్యంగా నోటి ఆరోగ్యానికి మేలు చేస్తాయి.
- ఇందులో ఉన్న ఫైబర్ కంటెంట్ ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయడానికి సహాయపడుతుంది, గట్ ఆరోగ్యాన్ని కాపాడుతుంది..
- బరువును తగ్గించడంలో కూడా చాలా బాగా పనిచేస్తుంది..
- గుండె ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది.
- నిమ్మకాయ తొక్కలను ఎండబెట్టి వాటిని ఆహారంలో భాగం చేసుకోవచ్చు. ఉదాహరణకు ఎండిన నిమ్మ తొక్కలతో టీ తాగడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి..
- నాన్‌వెజ్ వంటల్లో నిమ్మరసం వాడుతుంటాం. దానికి బదులుగా నిమ్మ తొక్కల పొడిని ఉపయోగించవచ్చు. నిమ్మ తొక్కలు నానబెట్టిన నీళ్లతో స్నానం చేయడం వల్ల చర్మంపై వచ్చే ఇన్‌ఫెక్షన్లు తగ్గుముఖం పడతాయి.

హైబ్రిడ్ మోడల్‌లో ఆసియాకప్

ఆగస్టు 31నుంచి సెప్టెంబర్ 17వరకు టోర్నీ • పాకిస్తాన్‌లో నాలుగు, శ్రీలంకలో తొమ్మిది వన్డేలు

షెడ్యూల్ ఖరారు

గ్రూప్-ఏ: భారత్, పాకిస్థాన్, నేపాల్
గ్రూప్-బి: శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్

ముంబయి: ఈ ఏడాది జరగనున్న ఆసియా కప్ వేదికలు ఖరారయ్యాయి. పాకిస్తాన్, శ్రీలంక సంయుక్తంగా 2023 ఆసియాకప్ టోర్నీకి ఆతిథ్యమివ్వనున్నట్లు ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఎసిసి) గురువారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఆగస్టు 31నుంచి సెప్టెంబర్ 17వరకు ఈ టోర్నమెంట్ జరగనున్నట్లు ఎసిసి ఆ ప్రకటనలో పేర్కొంది. పాకిస్తాన్‌లో నాలుగు, శ్రీలంకలో తొమ్మిది మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ టోర్నమెంట్‌లో ఆతిథ్య పాకిస్తాన్, శ్రీలంకతోపాటు భారత్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, నేపాల్ జట్లు పాల్గొనున్నాయి. మొత్తం 13వన్డే మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈసారి టోర్నీలో తలపడే ఆరుజట్లను రెండు గ్రూపులుగా విభజించారు. ప్రతి గ్రూప్‌లోని ఒక జట్టు మిగిలిన రెండు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడనుంది. రెండు గ్రూపుల్లో టాప్-2లో నిలిచి జట్లు సూపర్-4 స్టేజ్‌లో తలపడనున్నాయి. సూపర్-4లో ప్రతి జట్టు మూడు మ్యాచ్‌లు ఆడిన తర్వాత అగ్రస్థానంలో ఉన్న రెండు జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుంది. టోర్నీ 18 రోజులపాటు జరగనుంది. వన్డే ఫార్మాట్‌లో హైబ్రిడ్ మోడల్‌లో టోర్నీ జరుగుతుందని ఎసిసి వెల్లడించింది. దీంతో 15ఏళ్ల తర్వాత ఆసియా కప్ టోర్నీకి ఆతిథ్యమిచ్చే అవకాశం పాకిస్థాన్‌కు రావడం గమనార్హం. మరోసారి భారత్-పాకిస్తాన్ మ్యాచ్‌ను వీక్షించే అవకాశం అభిమానులకు రానుంది. అయితే శ్రీలంక వేదికగానే ఇరుజట్ల మ్యాచ్ జరగనుంది. సెప్టెంబర్ 17న ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది.

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ), పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పిసిబి) బోర్డుల మధ్య సఖ్యత లేని కారణంగా ఆసియా కప్ నిర్వహణపై తొలుత సందిగ్ధత నెలకొంది. పాకిస్తాన్ కు తమ జట్టును పంపించేం దుకు బిసిసిఐ నిరాకరించడంతో పిసిబి తమ జట్టును భారత్ వేదికగా జరిగే ప్రపంచకప్‌లో పాల్గొనేది లేదని స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే తమ దేశంలో కొన్ని, తటస్థ వేదికల్లో కొన్ని మ్యాచ్‌లు నిర్వహించేలా హైబ్రిడ్ మోడల్‌ను పాక్ ప్రతిపాదించింది. బిసిసిఐ సహా శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ అందుకు అంగీకరించకపోవడంతో ఆ సమస్య మరింత జఠిలమైంది. దీంతో ప్రపంచకప్‌లో ఆడేది లేదని పాక్ తేల్చి చెప్పింది. ఈ క్రమంలో దాయాదుల పోరు లేకుండా ప్రపంచ కప్ జరిగితే టోర్నీకి ఆకర్షణ తగ్గుతుందని భావించిన ఐసిసి రంగంలోకి దిగింది. ఎలాంటి షరతులు లేకుండా పాక్‌ను ఒప్పించింది. అదే క్రమంలో పాక్ ప్రతిపాదించిన హైబ్రిడ్ మోడల్‌ను ఎసిసి కూడా అంగీకరించడంతో ఆసియా కప్ నిర్వహణకు అడ్డంకులు తొలిగి పోయాయి. భారత్ ఆడే మ్యాచ్‌లతో పాటు సూపర్-4 పోరు శ్రీలంకలో జరుగుతుంది. ఇంకా వేదికలను ఖరారు చేయాల్సి ఉంది. గత ఏడాది టి20 ఫార్మాట్‌లో జరిగిన ఆసియా కప్ విజేతగా శ్రీలంక నిలిచింది.

క్వార్టర్స్‌కు శ్రీకాంత్, ప్రణయ్

సింధు, ప్రియాంశు ఓటమి
ఇండోనేషియా ఓపెన్

జకార్తా: ఇండోనేషియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్‌ఫైనల్లోకి కిదాంబి శ్రీకాంత్, హెచ్ఎస్ ప్రణయ్‌రాయ్ ప్రవేశించగా.. ప్రి క్వార్టర్స్‌లో పివి సింధు, ప్రియాంశు రాజ్‌వత్ ఓటమిపాలయ్యారు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లో 7వ సీడ్ హెచ్ఎస్ ప్రణయ్ రాయ్ 21-18, 21-16తో లాంగ్-అంగ్వా(సింగపూర్)పై, కిదాంబి శ్రీకాంత్ 21-12, 22-20తో సహచర ఆటగాడు లక్ష్యసేన్‌పై వరుససెట్లలో గెలుపొందారు. మరో పోటీలో ప్రియాంశు రాజ్‌వత్ 22-20, 15-21, 15-21తో 2వ సీడ్ గింటింగ్(ఇండోనేషియా) చేతిలో పోరాడి ఓడాడు. ఇక మహిళల సింగిల్స్‌లో పివి సింధు 18-21, 16-21తో 3వ సీడ్, చైనీస్ తైపీకి చెందిన తై-జు-యింగ్ చేతిలో వరుససెట్లలో ఓటమిపాలైంది. ఇక పురుషుల డబుల్స్‌లో 7వ సీడ్ చిరాగ్‌శెట్టి-సాత్విక్ సాయిరాజ్ జోడీ 21-17, 21-16తో చైనాకు చెందిన హి-జి-టింగ్-జు హో డాంగ్‌పై విజయం సాధించి క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లారు.

యాషెస్ సిరీస్ కొట్టేదెవరో..!

బర్మింగ్‌హామ్ వేదికగా నేటినుంచి తొలిటెస్ట్

లండన్: ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. గత పదేళ్లలో ఒక్కసారి మినహా.. మిగిలిన నాలుగుసార్లు ఆస్ట్రేలియా జట్టు యాషెస్ సిరీస్‌ను కైవసం చేసుకుంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్లో నెగ్గిన ఆస్ట్రేలియా జట్టు అద్భుత ఫామ్‌లో ఉండగా.. ఆతిథ్య హోదాలో ఇంగ్లండ్ జట్టు కూడా దుర్భేద్యంగానే కనబడుతోంది. శుక్రవారం నుంచి ఇంగ్లండ్‌లోని బర్మింగ్‌హామ్ వేదికగా తొలిటెస్ట్ జరగనుంది. గత ఐదు సిరీస్‌లలో ఆస్ట్రేలియా జట్టు ఇంగ్లండ్‌పై మెరుగైన రికార్డును కలిగి ఉంది. మూడుసార్లు గెలిచి ఒకసారి సిరీస్‌ను డ్రా చేసుకొని, ఒక్కసారి మాత్రమే ఈ సిరీస్‌ను చేజార్చుకుంది.

షెడ్యూల్

జూన్ 16-20: తొలిటెస్ట్(బర్మింగ్‌హామ్) జూన్ 28-జులై 2: రెండోటెస్ట్(లండన్, లార్డ్)
జులై 6-10 : మూడోటెస్ట్(లీడ్స్) జులై 19-23 : నాల్గోటెస్ట్(మాంచెస్టర్)
జులై 27-31 : ఐదోటెస్ట్(లండన్, ఓవల్)

గత ఐదు యాషెస్ సిరీస్ ఫలితాలు..

యాషెస్	విజేత	ప్లేయర్ ఆఫ్ ది సిరీస్	అత్యధిక పరుగులు/వికెట్లు
2021-22	ఆస్ట్రేలియా 4-0	ట్రెవిస్ హెడ్	357పరుగులు(6ఇన్నింగ్స్)
2019	డ్రా 2-2	స్టీవ్ స్మిత్	774పరుగులు(7ఇన్నింగ్స్)
2017-18	ఆస్ట్రేలియా 4-0	స్టీవ్ స్మిత్	687పరుగులు(7ఇన్నింగ్స్)
2015	ఇంగ్లండ్ 3-2	జో రూట్	460పరుగులు(9ఇన్నింగ్స్)
2013-14	ఆస్ట్రేలియా 5-0	మిచెల్ జాన్సన్	37వికెట్లు



ధైర్యం కోసం ప్రార్థించాను

'వ్యాధి నిర్ధారణ జరిగి ఒక సంవత్సరం అయింది. ఈ ఏడాదిని ఎంతో బలవంతంగా ముగించాను. నా శరీరంతో ఎన్నో పోరాటాలు చేశాను. ఉప్పు, పంచదార లేని ఫుడ్ తిన్నాను. ఎంతో మత్తుతో కూడిన మందులు వేసుకున్నాను. ఎప్పటికప్పుడు బలవంతంగా జీవితాన్ని రీస్టార్ట్ చేస్తూనే వచ్చాను. నన్ను నేను చూసుకొని, ఆత్మ పరిశీలన చేసుకున్న ఏడాది ఇది. కెరీర్‌పరంగా కూడా ఎన్నో పరాజయాలు చవిచూశాను. వీటి కోసం ఎన్నో ప్రార్థనలు, పూజలు చేశాను. నాకు ధైర్యాన్ని, బలాన్ని, మనశ్శాంతిని ఇవ్వమని ప్రార్థించాను. అన్ని వేళలా కాలం నీది కాదు అని నేర్పిన ఏడాది ఇది. ముఖ్యంగా.. నేను కంట్రోల్ చేయాల్సినవి మాత్రమే కంట్రోల్ చేయాలి.. మిగిలినవి వదిలేయాలి. ఒక్కోసారి రిస్క్ అయినా ఒక్కో అడుగు ముందుకు వేస్తూ ఉండాలి. అయితే ఆ అడుగు కొన్నిసార్లు విజయం అందుకోవడం కోసం కాదు.. ముందుకు సాగడానికి మాత్రమే. అలా ముందుకు సాగడం కూడా ఒక విజయమే అని ఈ ఏడాది నాకు నేర్పింది. కొన్ని విషయాల గురించి ఆలోచించుకుంటూ కూర్చోకూడదు. నా ప్రేమను, నన్ను ఇష్టపడేవారిని వెతకాలి. నన్ను ప్రభావితం చేసే శక్తిని ద్వేషించకూడదు' అంటూ సమంత తన ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.

జులై 14న 'బేబీ'

ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న 'బేబీ' చిత్ర విడుదల తేదీ ఖరారైంది. విరాజ్ అశ్విన్ కీలకపాత్రలో నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ పూర్తై.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. సాయి రాజేష్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాని ఎస్కేఎన్ సంస్థ నిర్మిస్తోంది. తాజాగా ఈ మూవీ రిలీజ్ డేట్ ఫిక్స్ చేశారు మేకర్స్. వచ్చే నెలలో అంటే జులై 14న ఈ సినిమాను విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు.

ఓటీటీలోకి 'ఇంటింటి రామాయణం'

రాహుల్ రామకృష్ణ, నవ్య స్వామి, నరేష్ తదితరులు కీలక పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'ఇంటింటి రామాయణం'. సురేశ్ దర్శకుడు. ఇటీవల థియేటర్స్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ వేదికగా అలరించేందుకు సిద్ధమైంది. తెలుగు ఓటీటీ వేదిక 'ఆహా'లో జూన్ 23వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కానుంది. మధ్యతరగతి కుటుంబాలలో సహజంగా జరిగే సంఘటనల నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68